

తిరుపతిలో హోటళ్లకు బాంబు బెదిరింపులు

- ఐఎస్ఐ ఉగ్రవాదుల నుంచి మెయిల్ రాక
- పోలీసుల ముమ్మర తనిఖీలు



రీనెస్ట్ హోటల్ వద్ద బాంబు స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల దేశవ్యాప్తంగా పలు విమానాల్లో బాంబులు అమర్చినట్టు బెదిరింపు మెయిల్స్ పంపిన రీతిలో తిరుపతిలోని హోటళ్లకూ గురువారం సాయంత్రం మెయిల్స్ వచ్చాయి. పాయ్ వైస్రాయ్, రిగాలియా, రీనెస్ట్, రాజ్‌పార్కు హోటళ్లకు బాంబు బెదిరింపు మెయిల్స్ రావడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. వీటిపై పోలీసులు అప్రమత్తమయ్యారు. డీఎస్పీ వెంకటనారాయణ, అలిపిరి సీఐ రాంకిషోర్, ఎస్ఐ నాగార్జున రెడ్డి, బాంబు డిస్పోజల్ (బీడీ) టీమ్ సీఐ శివారెడ్డి తదితరులు బాంబు బెదిరింపు వచ్చిన హోటళ్ల వద్దకు చేరుకున్నారు. బాంబు స్క్వాడ్ ఇన్‌చార్జి వీరయ్య నేతృత్వంలో సిబ్బంది చాంద్‌బాషా, చెంగ్రాయలు, మురళి, ముద్దుకృష్ణ, శ్రీనివాసులు, హెడ్ కానిస్టేబుల్ దయాకర్, రమేష్ బాంబు డిస్పోజల్ పరికరాలతో అన్ని హోటళ్లలో తనిఖీలు చేశారు. మరోవైపు పేలుడు పదార్థాలు పసికట్టే పోలీసు జాగిలం లీలతోనూ అన్ని గదులు, చుట్టుపక్కల ప్రాంతాలు, వంటగదులు, మేనేజర్ గదులు తనిఖీ చేశారు. ఎక్కడా బాంబులు లేవని నిర్ధారణకు రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

స్టార్ ఎయిర్‌లైన్స్ విమానానికీ..

రేణిగుంట, అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి):తిరుపతి మీదుగా నడిచే స్టార్ ఎయిర్ లైన్స్ విమానాన్ని బాంబుతో పేల్చివేస్తామంటూ ట్విట్టర్ ద్వారా అగంతకుడొకరు బెదిరించారు. తిరుపతి విమానాశ్రయ అధికారుల కథనం మేరకు... బెంగళూరు నుంచి తిరుపతికి, ఇక్కడి నుంచి బెల్గాంకు సర్వీసులు నడుపుతున్న స్టార్ ఎయిర్ లైన్స్ కంపెనీ విమానాన్ని బాంబులతో పేల్చి వేస్తామంటూ ఓ అగంతకుడు మెసేజ్ పెట్టడంతో గుర్తించిన విమానాశ్రయ అధికారులు, భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. తిరుపతి విమానాశ్రయంలోని కేంద్ర బలగాలు గురువారం మధ్యాహ్నం నుంచి వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన విమానాలను తనిఖీ చేశారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం శివమొగ్గ నుంచి సాయంత్రం ఏడు గంటలకు తిరుపతికి చేరుకొని తిరిగి ఏడున్నరకు శివమొగ్గకు బయల్దేరే విమానాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేశారు. అయితే ఎటువంటి పేలుడు వస్తువులు విమానంలో కన్పించకపోవడంతో అది ఒక ఫేక్ కాల్‌గా గుర్తించి విమానాన్ని పంపివేశారు.



తనిఖీలు చేపట్టిన డాగ్ స్క్వాడ్



నిండ్ర ఎస్సీకాలనీలో సర్వేని పరిశీలిస్తున్న హౌసింగ్ పీడీ పద్మనాభం

సొంతింటిపై కొంగొత్త ఆశలు

- టీడీపీ హయాంలో నిర్మించుకున్నవారి బిల్లుల్ని ఆపిన వైసీపీ సర్కారు
- బిల్లుల మంజూరుకు ప్రస్తుత ప్రభుత్వం ముందడుగు
- ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు

చిత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 2014-19 మధ్యకాలంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకాన్ని అమలు చేసింది. అప్పట్లోనే ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు యూనిట్ కాస్ట్‌గా మంజూరు చేసి 2019 వరకు బిల్లుల్ని కూడా మంజూరు చేసింది. టీడీపీ హయాంలో నిర్మాణాలు చేపట్టి, బిల్లులు మంజూరు కాని లబ్ధిదారులకు... ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూరితంగా బిల్లుల్ని ఆపేసింది. చిత్తూరు జిల్లాలో 29,093 మంది లబ్ధిదారులకు రూ.47.19 కోట్లు, తిరుపతి జిల్లాలో 23,484మంది లబ్ధిదారులకు రూ.39.06 కోట్లను నిలిపేసింది. అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులు బిల్లులు రాకపోవడంతో నష్టపోయారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వారిలో ఆశలు చిగురించాయి.పాత బిల్లుల్ని మంజూరు చేసేందుకు ఎన్టీఆర్ గృహ లబ్ధిదారుల్ని గుర్తించే పనిలో హౌసింగ్ అధికారులు ఉన్నారు. ఎన్టీఆర్ వెరిఫికేషన్ యాప్ ద్వారా చేస్తున్న ఈ సర్వే చిత్తూరు జిల్లాలో గురువారంతో పూర్తయింది.తిరుపతి జిల్లాలో కూడా చివరి దశలో ఉంది. మంజూరైన గృహాలు ప్రస్తుతం ఏ దశలో వున్నాయనే వివరాలు నమోదు చేస్తున్నారు.అలాగే వివిధ దశల్లో ఆగిపోయిన గృహ నిర్మాణాలను పూర్తి చేసేందుకు కూడా కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. త్వరలో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంఏవై-2.0 గ్రామీణ గృహ నిర్మాణ పథకానికి బదలాయించి పనులు పునఃప్రారంభించేందుకు కసరత్తు జరుగుతోందంటున్నారు . ఏ దశలో ఉన్న నిర్మాణాలను ఈ కేంద్ర పథకానికి వర్తింపజేస్తారనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది. ఒక్కో యూనిట్ కాస్ట్‌ను రూ.4 లక్షలు అని ఆ మధ్య సీఎం చంద్రబాబు ప్రకటించినా.. కేంద్ర ప్రభుత్వం తన వాటాను పెంచకపోవడంతో తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2014 నుంచి కూడా కేంద్ర ప్రభుత్వం తన వాటాను రూ.1.50 లక్షలుగా ఇస్తోంది. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అదనంగా రూ.లక్ష వాటా వేసి లబ్ధిదారులకు రూ.2.50 లక్షలిచ్చేది. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం నయాపైసా కూడా రాష్ట్రం తరఫున వాటా కేటాయించలేదు. దీంతో చాలామంది లబ్ధిదారులు నిర్మాణాలకు ముందుకు రాలేదు. జిల్లాకు 72,272 గృహాలు మంజూరైతే సగం కూడా నిర్మాణాలు పూర్తికాలేదు. ఇప్పుడు కూడా కేంద్రం తన వాటా పెంచకపోవడంతో.. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆలోచనలో పడినట్లు తెలుస్తోంది. రూ.2.50 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు యూనిట్ కాస్ట్ ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.



శాంతిపురం మండలం రాళ్లబూదుగూరులో సర్వే చేస్తున్న సిబ్బంది

ఎన్టీఆర్ గ్రామీణ గృహ లబ్ధిదారుల వివరాలు

జిల్లా	గృహాలు	పెండింగ్ బిల్లులు రూ.కోట్లలో
చిత్తూరు	29,093	రూ.47.19
తిరుపతి	23,484	రూ.39.06

డీఆర్వోగా నరసింహులు

- ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల బదిలీ
- తిరుపతి ఆర్డీవోగా రామ్మోహన్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి డీఆర్వోగా జి.నరసింహులును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37మంది స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ తూర్పు గోదావరి జిల్లా డీఆర్వో (జిల్లా రెవెన్యూ అధికారి)గా పనిచేస్తున్న నరసింహులును ఇక్కడకు పంపారు. ఇక్కడ పనిచేస్తున్న పెంచలకిషోర్‌ను జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. జిల్లా ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ ఎస్‌డీసీగా విధులు నిర్వహిస్తూ తిరుపతి ఇన్‌చార్జి ఆర్డీవోగా వ్యవహరిస్తున్న బి.రామ్మోహన్‌ను తిరుపతి రెగ్యులర్ ఆర్డీవోగా నియమించారు. వైజాగ్, చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్(వీసీఐసీ) స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న కేటీ నరసింహులును డోన్ ఆర్డీవోగా నియమించారు. తిరుపతి జిల్లా ప్రొటోకాల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ టి.చంద్రశేఖర్‌నాయుడును చీరాల ఆర్డీవోగా నియమించారు. జిల్లాలోని ల్యాండ్ ప్రొటెక్షన్, వీసీఐసీ, ప్రొటోకాల్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు ఎవరినీ నియమించలేదు. తిరుపతి జిల్లా డీఆర్వోగా అవకాశం రావడం పూర్వజన్మ సుకృతమని జి.నరసింహులు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. గతేడాది సెప్టెంబరులో డీఆర్వోగా పెంచలకిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ఏడాది పాటు తిరుపతిలో విధులు నిర్వహించడం సంతోషం కలిగించిందని చెప్పారు.



నరసింహులు

డీఈవోగా కేవీఎన్ కుమార్



తిరుపతి(విద్య), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా కేవీఎన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి కోన శశిధర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న డాక్టర్ వి.శేఖర్‌ను బదిలీ చేశారు. ఎన్టీఆర్ జిల్లా డీఈఓగా పనిచేస్తున్న కుమార్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లి ఉప విద్యాశాఖాధికారిగా, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారిగా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. రెండు మూడు రోజుల్లో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

మీ ప్రైవేటు ఆస్పత్రిలో ఇలాగే చేస్తారా?

- ఓపీలో వైద్యుల పనితీరుపై వైద్యఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అసంతృప్తి
- రుయాస్పత్రిలో మెరుగైన సేవలకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందన్న కృష్ణబాబు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'మీ ప్రైవేటు ఆస్పత్రిని ఇలాగే నిర్వహిస్తారా? ఇలా డ్యూటీలకు రాని వారికి జీతాలు ఇస్తారా?' అంటూ ఓపీ కేంద్రం వద్ద వైద్యాధికారులను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు సూటిగా ప్రశ్నించారు. వెంటనే పనితీరు మార్చుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి గురువారం ఆయన రుయాస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత అత్యవసర విభాగాన్ని పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, వైద్య పరికరాలను పరిశీలించారు. క్యాజువాలిటీ వార్డు చాలడంలేదని అక్కడి వైద్యులు చెప్పగా.. భవనం విషయంపై దృష్టి సారించాలని సూపరింటెండెంట్ రవిప్రభును ఆదేశించారు. అక్కడ్నుంచి ఓపీ కేంద్రాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం ఓపీలో ఎనిమిది విభాగాల వైద్యులకుగాను ఒకే విభాగానికి చెందిన వారు ఉండటంపై ఆగ్రహించారు. రక్తపరీక్షా కేంద్రంలో ఎప్పుడో వచ్చిన రిపోర్టులు అక్కడే ఉండటంపై ప్రశ్నించారు. రోగులు వచ్చి తీసుకోవడం లేదని అధికారులు చెప్పగా.. సకాలంలో ఇస్తే ఎందుకు తీసుకోరని మండిపడ్డారు. రక్త పరీక్షల ఫలితాలను ఒక్కరోజులోనే అందించాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు. ఇంకా రిపోర్టులు కాగితాలపై రాసివ్వడం ఏంటని అసంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం కృష్ణబాబు మీడియాతో మాట్లాడుతూ.. రుయాస్పత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సూపరింటెండెంట్, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ సమన్వయంతో కృషి చేయాలని ఆదేశించామన్నారు. పీజీ సీట్లు పెంచుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఆస్పత్రిలో వైద్య విద్యార్థుల కోసం రూ.70 కోట్లతో నూతన భవనాలను నిర్మించామని, వైద్య పరికరాల కోసం మరో రూ.15 కోట్లు విడుదల చేశామన్నారు. భవిష్యత్తులో రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రిన్సిపల్ చంద్రశేఖరన్, డీఎంహెచ్‌వో శ్రీహరి, ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథిరెడ్డి, ఏఆర్ఎంవో హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

రుయాలో ఏం జరిగింది?

- హెచ్‌డీఎస్ సభ్యుడి తీరుపై సీఎంవో ఆరా
- విచారణ చేపట్టిన పోలీసులు
- చైర్మన్‌గా చెలామణీ అయితే చర్యలు తప్పవంటూ కలెక్టర్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రుయాస్పత్రిలో బుధవారం జరిగిన రెండు ఘటనలపై సీఎం కార్యాలయం స్పందించింది. వీటిపై గురువారం ఆరా తీసింది. పూర్వపు విద్యార్థులు ఏర్పాటు చేస్తున్న అప్పటి వైద్య విభాగాధిపతి డాక్టర్ ఇందిరా బాయ్ విగ్రహ కార్యక్రమ శిలాఫలకంలో వర్కింగ్ కమిటీ చైర్మన్ హోదాతో తన పేరు ఎందుకు నమోదు చేయలేదని వైద్యాధికారులపై సభ్యుడు బండ్ల లక్ష్మీపతి ఆగ్రహించడం.. ఆ శిలాఫలకాన్ని తొలగించడం తెలిసిందే. అదేరోజు తన కారుకు అడ్డు వచ్చారంటూ ఆటో డ్రైవరుతో దురుసుగా ప్రవర్తించి ఆక్సిజన్ మాస్కుతో ఉన్న రోగిని ఇబ్బందులకు గురి చేసిన విషయమూ విదితమే. ఈ రెండు ఘటనలపై గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనాల నేపథ్యంలో విచారించి నివేదికలు పంపాలని సీఎంవో నుంచి జిల్లా అధికారులకు గురువారం ఆదేశాలు అందాయి. మరోవైపు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. వెస్ట్ సీఐ రామకృష్ణ రుయాస్పత్రికి చేరుకొని ఆక్సిజన్ మాస్కుతో ఆటోలో ఉన్న రోగిని ఇబ్బంది కలిగించేలా అవుట్ పోస్టు సిబ్బంది ఏమైనా వ్యవహరించారా అనే కోణంలో దర్యాప్తు చేశారు. చిన్నపిల్లల వార్డు ముందు తొలగించిన శిలాఫలకాన్ని పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. చైర్మన్ హోదాతో.. ఆస్పత్రి ఆవరణలో హెచ్‌డీఎస్ సభ్యుడు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే మీరెందుకు ఊరుకున్నారు.. మా దృష్టికి ఎందుకు తీసుకురాలేదని సూపరింటెండెంట్ రవిప్రభును కలెక్టరు వివరణ అడిగారు. వెంటనే ఆ ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశించారు. అతడికి ప్రత్యేక గది కేటాయించేందుకు కుదరదని, మరోసారి చైర్మన్ అని చెప్పుకొన్నా.. రోగులు ఇబ్బంది పడేలా వ్యవహరించినా తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

హెచ్‌డీఎస్ చైర్మన్‌గా కొత్త శిలాఫలకం

కాగా, డాక్టరు ఇందిరాబాయ్ విగ్రహ వద్ద శిలాఫలకంలో హెచ్‌డీఎస్ సభ్యుడు లక్ష్మీపతి పేరును హెచ్‌డీఎస్ చైర్మన్‌గా పేర్కొంటూ కొత్త శిలాఫలకాన్ని గురువారం సిద్ధం చేశారు. ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేయరాదని చిన్నపిల్లల విభాగాధిపతి మనోహర్‌ను సూపరింటెండెంట్ ఆదేశించారు. దీంతో పాత శిలాఫలకాన్నే ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. కాగా, శిలాఫలకంలో తన పేరు వేయాలని డిమాండు చేయలేదని, కలెక్టరు, ఎమ్మెల్యే పేర్లుంటే బాగుటుందని మాత్రమే చెప్పానని హెచ్‌డీఎస్ సభ్యుడు బండ్ల లక్ష్మీపతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



బండ్ల లక్ష్మీపతిని హెచ్‌డీఎస్ చైర్మన్‌గా పేర్కొంటూ సిద్ధం చేసిన శిలాఫలకం

ప్రభుత్వ కళాశాలకు పుస్తకాల బహూకరణ



పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గానుగపెంటకు చెందిన విశ్రాంత వైస్ చాన్స్‌లర్ కూతాటి వెంకటరెడ్డి తాను రచించిన భారత దేశ స్వాతంత్ర్య సమరంలో ఆంధ్రుల త్యాగాలు అనే పుస్తకాలను స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు బహూకరించారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి 50 పుస్తకాలను ప్రిన్సిపాల్ జేబీశ్వరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపాల్ వై.వెంకటరత్నంనాయుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు పి.సుబ్రమణ్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.రాజేంద్రనాయుడు, కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి ఆర్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత దీప్తి పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రఫీ

పాకాల అక్టోబరు 24: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ మ్యాథ్స్ ఫోరమ్ ద్వారా తయారు చేసిన గణిత దీప్తి స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.మహమ్మద్ రఫీ ఈ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. పుస్తకాలను సద్వినియోగం చేసుకొని అత్యుత్తమ మార్కులు సాధించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రమేష్ బాబు, జి.పురుషోత్తం, రెడ్డప్పరెడ్డి, శ్రావణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూసర్వే లోపాల దిద్దుబాటుకు అర్జీల స్వీకరణ



రైతుల నుంచి అర్జీ స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

భాకరాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సర్వేలో లోపాలను సవరించి సమగ్రంగా భూరికార్డులను రూపొందిస్తామని తహసీల్దారు జనార్దన్‌రాజు తెలిపారు. చిన్నగొట్టిగల్లు మండలం కోటబైలు గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో భూ సర్వే నిర్వహించారు. ఆ సర్వేలో తలెత్తిన లోపాలను సరిదిద్దడానికి గురువారం గ్రామసభ నిర్వహించారు. 75 మంది రైతులు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులు అధైర్యపడాల్సిన పని లేదన్నారు. రీసర్వేలో తలెత్తిన లోపాలు, భూముల సర్వే నెంబర్లు, సరిహద్దులు, పట్టాదారు పాసుపుస్తకాల్లో పేర్ల తప్పులు చోటు చేసుకున్నాయన్నారు. వాటిని సరి చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. నవంబరు 23 వరకు అర్జీలు తహసీల్దారు కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం తప్పులను సరిచేసి వెబ్ ల్యాండ్‌లో పొందుపరుస్తామన్నారు. రీసర్వే డివిజనల్ ఇన్‌స్పెక్టర్ చంద్రబాబు, డీటీ వాసుదేవకుమార్, ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్లు గణేశ్, కేశవులు, సాధిక్, రహంతుల్లా, వీఆర్వో సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కోదండ రాముని ఆలయ పవిత్రోత్సవాలు



పవిత్రమాలలు తీసుకొస్తున్న అర్చకులు

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోదండ రామస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలు గురువారం ఘనంగా ముగిశాయి. ఉదయం 5.30 నుంచి 6 గంటల వరకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, నిత్యార్చన నిర్వహించారు. మధ్యాహ్నం 11 గంటల వరకు ద్వారా తోరణ, ధ్వజకుంభారాధన, చతుష్టార్చన, మూర్తి హోమం, శాంతి హోమం, మహా పూర్ణాహుతి, పవిత్ర వితరణ, వేదశాత్ మొర కార్యక్రమాలు నిర్వహించారు. అనందరం సీతారామలక్ష్మణ సమేత హనుమంతుస్వామివారు, సుదర్శన చక్రతాళ్వార్‌లకు స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులకు అభిషేకించాక చక్రతాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహించారు. సాయంత్రం తిరుచ్చిపై సీతాలక్ష్మణ సమేత కోదండరామస్వామి విహరించి భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు,ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా చంద్రగిరి అభివృద్ధి కమిటీ ఎన్నిక



కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ అభివృద్ధి కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చంద్రగిరిలోని శ్రీకృష్ణ మందిరంలో పంచాయతీ టీడీపీ నాయకులతో ఎమ్మెల్యే పులివర్తి నాని సమావేశమైయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ సూచించిన ప్రకారం పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కమిటీలో ఛైర్మన్‌గా ఎమ్మెల్యే పులివర్తి నాని, సభ్యులుగా టీడీపీ నాయకులు రమేష్‌రెడ్డి, శివకోటేశ్వరరెడ్డి, దుబాసి రామ్మూర్తి, గౌస్‌బాషా, రిటైర్డు ప్రిన్సిపాల్ నాగరాజనాయుడు, డిష్ గోపినాథ్, సోషల్ వర్కర్ జనార్ధన్‌రెడ్డి, ఓంకార్ భరద్వాజ్, కాంగ్రెస్ నాయకుడి సతీమణి కేపీఎస్ ప్రమీల వాసులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నాయకులు కుమారరాజారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●రాయలపురం పంచాయతీ, వెంకటంపేట వద్ద రహదారిపై వరద నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే నాని అధికారులను ఆదేశించారు. చంద్రగిరి నుంచి పూతలపట్టు, నాయుడుపేట జాతీయ రహదారికి వెళ్ళే మార్గంలో వెంకటంపేట వద్ద రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోతుంది. గురువారం నాని వెంకటంపేట వద్ద నిలిచిపోయిన వరద నీటిని పరిశీలించారు. సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

తూకివాకం సోలార్ ప్లాంట్‌పై అలసత్వమెందుకు?



తిరుపతి, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో తూకివాకం వద్ద ఏర్పాటు చేసిన 6 మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ పనులపై అలసత్వం ఎందుకని స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సోలార్ ప్లాంట్‌పై ఆమె సమీక్షించారు. ఇచ్చిన గడువు కంటే ఎక్కువ సమయం అవుతున్నా ఎందుకు ఆలస్యం అవుతోందని ప్రశ్నించారు. అధికారులు వెంటనే స్పందించి సోలార్ ప్లాంట్ శుభ్రం చేసి పనులు చేయాలని ఆదేశించారు. స్మార్ట్ సిటీ అధికారులు, ఏయికాం ప్రతినిధులు సమన్వయం చేసుకుని వీలైనంత త్వరగా పెండింగ్ పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. సమావేశంలో ఎస్ఈ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ జీఎం చంద్రమౌళి, డీఈ లలిత, ఏయికాం ప్రతినిధులు బాలాజీ, అనిల్ పాల్గొన్నారు.

పూర్ణకుంభం కూడలిలో ట్రాఫిక్ సమస్యలు



పూర్ణకుంభం కూడలి వద్ద బారికేడ్లు

తిరుపతి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండు ముందున్న పూర్ణకుంభం కూడలిలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకు పెరుగుతోంది. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పేరుతో గతంలో బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లేమార్గంలో అడ్డుగా పెద్ద పెద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో తిరుమల బైపాస్ నుంచి వచ్చే వాహనాలు బస్టాండు, రైల్వేస్టేషన్‌కు వెళ్లాలంటే రామానుజసర్కిల్ చుట్టేసుకొని వస్తున్నాయి. రవాణా దూరం పెరగడంతో రైల్వేస్టేషన్‌కు, బస్టాండుకు సకాలంలో చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. అంబులెన్స్‌లు కూడా ఇదే దారిన రావాల్సి ఉంది. ద్విచక్ర వాహనాల కోసం చిన్నపాటి సందు వదలడంతో దాటేందుకు కంగారు పడుతున్నారు. పలుమార్లు ట్రాఫిక్ పోలీసులకు తెలిపినా పట్టించుకోకపోవడంతో పలువురు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. మార్పులు చేయాలని ఆయన ట్రాఫిక్ అధికారులను ఆదేశించినా పట్టించుకోలేదు. వెంటనే బారికేడ్లు తొలగించి వలయంలో అన్ని వైపులా వాహనాలు నడిచేలా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

సిబ్బంది కొరతతో సతమతం

- రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో సమస్యల తిష్ట
- విధుల్లో చేరని ఆర్ఐ
- సిబ్బందికి నీటి తిప్పలు



రూరల్ తహసీల్దార్ కార్యాలయం

తిరుపతి రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుపతిరూరల్ మండల తహసీల్దార్ కార్యాలయం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. సిబ్బంది కొరతతో పాటు మౌలికసదుపాయాలు లేక ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కార్యాలయ ప్రాంగణంలోని బోరుమోటారు మరమ్మతులకు గురైంది. నాలుగేళ్లుగా వాష్‌రూమ్‌కి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొందరు పక్కన ఉన్న అర్బన్ తహసీల్దార్ కార్యాలయం నుంచి రోజూ నీరు తెచ్చుకుంటున్నారు. మహిళా ఉద్యోగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. కార్యాలయ గోడలకు అక్కడక్కడ పగులు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షాలకు కూడా నీరు కిందకి దిగుతోంది. నెలరోజుల క్రితం జేసీ కార్యాలయ సీసీ రఘువర్మ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా ఇక్కడికి బదిలీ అయినా ఇప్పటికీ బాధ్యతలు చేపట్టలేదు. క్షేత్రస్థాయిలో వీఆర్వోలకు సంబంధించిన పలు కీలక ఫైల్స్ పర్యవేక్షణ, సంతకాలతోపాటు వారిపై అజమాయిషీ కూడా ఆర్ఐకి ఉంటుంది. భూముల ఆక్రమణల వ్యవహారాలు, ప్రొటోకాల్ వంటి కీలక బాధ్యతలను కూడాచూడాలి. నెలరోజులుగా తహసీల్దార్‌పైనే అదనపు భారం పడుతోంది. ఆర్ఐకి సమానమైన కేడర్‌లో పనిచేస్తున్న ఉన్నవారికి ఈ బాధ్యతలు అప్పగించవచ్చు. అటువంటి హోదా కలిగిన వారు లేకపోవడంతో తహసీల్దారే ఈ విధులను చేపడుతున్నారని తెలిసింది.

వీఆర్వోలు అంతంతమాత్రమే

మండలానికి 34మంది వీఆర్వోలను కేటాయించాల్సి ఉంది. ప్రస్తుతానికి 24మంది పని చేస్తున్నారు. మిగిలిన 10మంది వీఆర్వోల స్థానంలో ఉన్నవారికే ఇన్‌చార్జీలుగా అదనపు బాధ్యతలను అప్పగించారు. దీంతో వీరు కూడా అక్కడో అడుగు.. ఇక్కడో అడుగు అన్న చందాన అదనపు పనిభారంతో సతమతమవుతున్నారని తెలిసింది. ఇక్కడి సీనియర్ అసిస్టెంట్‌ని బదిలీ చేసినా కొత్తవారిని నియమించలేదు. ఎర్రావారిపాళెంలో పనిచేసే వ్యక్తికి రూరల్ మండల జూనియర్ అసిస్టెంట్‌గా డైవర్షన్(ఇన్‌చార్జి) ఇవ్వగా ఇప్పటివరకు చేరలేదు. ఈవిషయమై తహసీల్దార్ రామాంజులునాయక్‌ని వివరణ కోరగా కొందరికి ఇన్‌చార్జిలుగా బాధ్యతలు అప్పగించామన్నారు. సీసీని రిలీవ్ చేస్తామని, జూనియర్ అసిస్టెంట్‌ని అలాట్ చేస్తామని ఉన్నతాధికారులు చెప్పారన్నారు.

పల్లె పండుగతో పంచాయతీల ప్రగతిపథం

- అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే నాని



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంతో పంచాయతీలు అభివృద్ధి చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని చెప్పారు. గురువారం చంద్రగిరి మండలంలోని రాయలపురం పంచాయతీలో రూ.5 లక్షల వ్యయంతో మురుగు కాలువ నిర్మాణానికి, చంద్రగిరి పంచాయతీలో రూ.25 లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి, చిన్నరామాపురం పంచాయతీ, మూలపల్లెలో రూ.30 లక్షలతో మురుగు కాలువ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నాలుగు నెలల్లో తీరుస్తామన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సుమారు రూ.16.59 కోట్లతో మురుగు కాలువలు నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. దీర్ఘకాలిక సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. గత పాలకులు గ్రామ సమస్యలు మరిచి వారి సంపాదనే ధ్యేయంగా పనిచేసారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం దిశగా పయనిస్తుందన్నారు.ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



తిరుమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు తిరుమల సీఆర్వో కార్యాలయం వెనుకభాగంలో సుమారు యాభైఏళ్ల వయసున్న వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందినట్టు గుర్తించారు. మృతుడు ఒరిస్సాకు చెందిన సంజయ్‌గా అక్కడున్న కొందరు కార్మికులు పోలీసులకు తెలిపారు. ఇతను ఐదారేళ్లుగా తిరుమల, తిరుపతి పరిసర ప్రాంతాల్లో క్యాటరింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్నాడని సమాచారం. మృతదేహాన్ని అశ్విని ఆస్పత్రికి తరలించారు.

మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు బాక్సు చూపుతున్న అమరావతి జేఏసీ ప్రతినిధులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ జేఏసీ అమరావతి పురుష, మహిళా విభాగాలు కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఏపీ జేఏసీ అమరావతి మహిళా విభాగం జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని నాలుగు డివిజన్ల మహిళా విభాగం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తిరుపతి డివిజన్ అధ్యక్షకార్యదర్శులుగా లీలావతమ్మ, రేఖ, శ్రీకాళహస్తి డివిజన్ అధ్యక్షురాలిగా గుర్రమ్మ, సూళ్లూరుపేట డివిజన్ అధ్యక్షురాలిగా లక్ష్మీ, గూడూరు డివిజన్ అధ్యక్షురాలిగా అనురాధ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలు సమస్యలు, భవిష్యత్తు కార్యవరణపై చర్చించారు. మహిళలు తమ సమస్యలు విన్నవించుకునేందుకు కలెక్టర్ చాంబర్ పక్కనే ఫిర్యాదుల బాక్సు ఏర్పాటు చేశారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయలక్ష్మీ, ఉపాధ్యక్షులు సైకం శివకుమారి, జిల్లా అధ్యక్షకార్యదర్శులు గోపీనాథ్‌రెడ్డి, టి.సత్యనారాయణ, అన్వర్ బాషా, సంధ్యారాణి, పద్మజ పాల్గొన్నారు.

భూసర్వేలో అందరికీ న్యాయం : తహసీల్దార్



శొవ్వాయికాల్వలో నిర్వహిస్తున్న గ్రామసభ

రామచంద్రాపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గతంలో భూసర్వేలో జరిగిన తప్పిదాలను సరిచేస్తామని తహసీల్దారు వెంకటరమణ తెలిపారు. శొవ్వాయికాల్వ గ్రామంలో గురువారం భూరీసర్వే గ్రామసభ జరిగింది. ఏడాది క్రితం అప్పటి ప్రభుత్వం శొవ్వాయి కాల్వ, బ్రాహ్మణ కాల్వ గ్రామాల్లో సర్వే నిర్వహించింది. తప్పులు దొర్లడంతో రైతులు ఫిర్యాదు చేశారు. శొవ్వాయికాల్వలో 75 ఎకరాలకు సంబంధించి 11 సర్వే నెంబర్లలో కొన్ని తప్పులు దొర్లాయని 8మంది రైతులు గ్రామసభలో ఫిర్యాదు చేశారు. పరిశీలించి న్యాయంచేస్తామని తహసీల్దారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీటీ అమృత, సర్వేయర్లు రమేష్ బాబు, మణి, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్వో మల్లికార్జునరెడ్డి, విలేజ్ సర్వేయర్లు దుర్గ,చాన్‌బాషా, వర్మ, పురుషోత్తం దినేష్ పాల్గొన్నారు.

నారావారిపల్లెలో సీఎం ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే నాని

చంద్రగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లెలో ఆయన స్వగృహాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని గురువారం రాత్రి పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి సీఎం ఇంటిని పరిశీలించారు. ఏటా సంక్రాంతికి స్వగ్రామానికి వస్తున్న చంద్రబాబు కుటుంబ సభ్యులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రంగులు వేయడం, చిన్నపాటి మరమతులు చేయించడంతో పాటు మౌలిక వసతులు కల్పన, పోలీస్ బలగాల వసతి సదుపాయాలపై చర్చించారు. ఎ.రంగంపేట నుంచి బీ.కొంగరవారిపల్లె వరకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సమీప గ్రామాలైన మామిడిమానుగడ్డ, భీమవరం, మూలపల్లి, ప్రాంతాల్లో భీమానదిపై 2021లో వరదలకు కొట్టుకుపోయిన వంతెలను వీలైనంత త్వరగా పునర్నిర్మించాలన్నారు.

రుయాస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలని వినతి



కృష్ణబాబుకు సమస్యలు వివరిస్తున్న పారిశుధ్య కార్మికులు వినతి

తిరుపతి(వైద్యం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రుయాస్పత్రిలో అనేక సమస్యలు ఉన్నాయని, తక్షణమే పరిష్కరించాలని సీపీఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుకు విన్నవించారు. గురువారం రుయాస్పత్రికి వచ్చిన ఆయన్ను సీపీఐ నేతలు కలిసి రోగుల సమస్యలను వివరించారు. వసతులు లేక, సరైన వైద్యం అందక ఎంతో మంది రోగులు వేలూరు, బెంగళూరు, చెన్నైలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. వైద్యులు సక్రమంగా ఉండటం లేదని వైద్య పరికరాలు, సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు రవి, శివ, కేవైరాజా, మంజుల, విజయ, ప్రమీలమ్మ పాల్గొన్నారు. ●రుయాస్పత్రిలో నిత్యం రోగుల సేవలో పనిచేసే తమకు ఏజన్సీ నిర్వాహకులు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు చీఫ్ సెక్రటరీ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే మూడు నెలలుగా జీతాలు రాలేదని చెప్పారు. డిసెంబరు నాటికి కొత్త ఏజన్సీలు వస్తాయని, ఇక ఇలాంటి ఇబ్బందులు ఉండవని వివరించారు. పెండింగ్ జీతాలు చెల్లించేలా చూడాలని ఆదేశించారు.

'మహా ప్రస్థానం' ఏదీ?

'ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మా కుటుంబ సభ్యుడు చనిపోయారు. మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు మహా ప్రస్థానం వాహనం కోసం మూడు గంటలుగా ఎదురు చూస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలో వాహనం అందుబాటులో ఉన్నా రావడం లేదు. మీరే న్యాయం చేయండి' అంటూ కృష్ణబాబు వద్ద మృతుల కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని తక్షణమే పరిష్కరించాలని సూపరింటెండెంట్‌ను ఆయన ఆదేశించారు. మహాప్రస్థానం వాహనాల సంఖ్య పెంచి రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు.

59 నిమిషాల్లో జనవరి శ్రీవారి దర్శన టికెట్ల కోటా పూర్తి

తిరుమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి సంబంధించిన జనవరి నెల రూ.300 దర్శన టికెట్ల కోటా 59 నిమిషాల్లో పూర్తయింది. జనవరి నెలకు సంబంధించిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను టీటీడీ గురువారం ఉదయం 10 గంటలకు విడుదల చేసింది.10.59 గంటలకే కోటా మొత్తం పూర్తయింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా 10 నుంచి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనాలు జరుగనున్నాయి. ఈక్రమంలో 10 నుంచి 19వ తేదీ వరకు సంబంధించిన టికెట్లను డిసెంబరు నెలలో విడుదల చేయనున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు

తిరుమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.38 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది

మా కుటుంబానికి న్యాయం చేయండి



ఆవేదన వ్యక్తం చేస్తున్న వడ్డి యశోద

తిరుపతి (లీలామహల్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమ కుటుంబానికి ఆధారంగా ఉన్న పరిశ్రమను కూలదోసి బయటకు లాగేశారని, న్యాయం చేయాలని వడ్డి యశోద కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ మహిళా యూనివర్సిటీ వద్ద ఖాళీగా ఉన్న మఠం భూమిని డి.రాజేశ్వరరావు, వి.సరోజినిదేవి నుంచి బాడుగకు తీసుకుని పట్టుచీరలు, హ్యాండ్‌లూం, పవర్‌లూమ్ ఫ్యాక్టరీ నడుపుతున్నామన్నారు. అయితే ఉన్నఫలంగా భూ యజమానులు స్థలాన్ని ఖాళీ చేయాలని చెప్పారని, అద్దె ఇవ్వడం లేదన్న తప్పుడు సమాచారంతో కోర్టు నుంచి నోటీసు పంపారని పేర్కొన్నారు. కెవిట్ ద్వారా కొంత సమయం కావాలని తాము కోర్టును అడిగినట్లు తెలిపారు. ఈ విషయమై ఎమ్మార్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో సీఐ సమక్షంలో చర్చలు జరిగాయని, కోర్టు వివాదంలో ఉన్న అంశంపై గొడవలు పడొద్దని సూచించారన్నారు. భూయజమానులు పోలీసుల ఆదేశాలను సైతం లెక్క చేయకుండా ఈ నెల 18వ తేదీన 100 మందిని తీసుకొచ్చి తనపై దాడి చేశారని, ఫోను లాక్కుని ధ్వంసం చేశారని ఆవేదన చెందారు. చీరల కోసమని అప్పుచేసి తెచ్చిన రూ.5 లక్షల నగదు ఎత్తుకెళ్లారన్నారు. ఆస్తిని ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని, తనకు, కుటుంబానికి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. న్యాయం జరిగే వరకు షాపు వద్ద దీక్ష చేస్తానని స్పష్టం చేశారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కృష్ణబాబు-వసుధ మిశ్రా

తిరుమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రాష్ట్ర వైద్యశాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణబాబు, యూపీఎస్సీ సెక్రటరీ వసుధ మిశ్రా ఉన్నారు. వీరికి అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

పీఆర్సీ కమిటీ నియమించాలని వినతి

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామి మేరకు పీఆర్సీ కమిటీని నియమించాలని, ఐఆర్ ప్రకటించాలని ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘం నాయకుడు మన్నేరి ప్రభు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. విద్యాబోధనకు అడ్డంకిగా ఉన్న ఇతర కార్యక్రమాలను ఉపాధ్యాయులకు అప్పగించకూడదన్నారు. సమావేశంలో సంఘం నాయకులు జి.సుధాకర్, జి.యువరాజు, ఎం.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రష్ ఆస్పత్రిలో అన్నదానం



తిరుపతి(వైద్యం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం సతీమణి శాంతి సుబ్రహ్మణ్యం 11వ వర్ధంతి సందర్భంగా గురువారం రష్ ఆస్పత్రి ఆవరణలో అన్నదానం చేశారు. సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శాంతి సుబ్రహ్మణ్యం నిరుపేదలకు తనవంతు సాయం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగేవారని కొనియాడారు. దీనికి ముందు ఆయన కుమారుడు, కుమార్తె సాగర్‌రెడ్డి, మౌనరెడ్డిలతో కలిసి శాంతి సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రష్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలేశుని సేవలో దిల్‌రాజు దంపతులు



ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు దంపతులు గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం రాత్రి కాలినడకన తిరుమలకు చేరుకున్న దిల్ రాజు శ్రీవారికి తలనీలాలు సమర్పించి గురువారం ఉదయం సతీమణి తేజశ్విని, కుమారుడు అన్వయ్‌తో కలిసి గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారం

తిరుమల విఖనసట్రస్ట్ కార్యదర్శి

తిరుపతిరూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతికి ఆగమాలు ఆధారాలని తిరుమల విఖనసట్రస్ట్ కార్యదర్శి గంజాం ప్రభాకరాచార్యులు తెలిపారు. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో అర్చనం(వైఖానసం) అనే అంశంపై తొమ్మిది రోజుల జాతీయ సదస్సు గురువారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఆగమశాస్త్రం భగవన్నిర్మితమని, ఆధ్యాత్మిక మార్గంలో మన జీవనయాత్ర సఫలం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. రిటైర్డ్ ప్రొఫెసర్ తట్టా విజయరాఘవాచార్యులు మాట్లాడుతూ ఆలయాలలో అర్చకుని పాత్ర కీలకమైందని, అర్థపంచకం శరణాగతి తత్త్వాలు అలవర్చుకుని అర్చన చేస్తే విశేష ఫలితాలు ఉంటాయని చెప్పారు. వేదాంతం డీన్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లు, సబ్‌వేలు ఏర్పాటు చేయాలి

● తనపల్లి జంక్షన్ వద్ద సీపీఐ ఆందోళన


జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరానికి ఆనుకుని ఉన్న జాతీయ రహదారిలో కూడళ్లలో సర్వీసు రోడ్లు, సబ్‌వేలు, లైట్లు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, జిల్లా కార్యదర్శి మురళి కోరారు. ఈ మేరకు తనపల్లి జంక్షన్ వద్ద హైవేలో సీపీఐ నేతలు గురువారం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి పూర్తి చేయకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఏడాది కాలంలో 60మందికి పైగా మరణించారని, 300 మంది క్షతగాత్రులు అయ్యారని వెల్లడించారు. టోల్‌ప్లాజాల పేరుతో రూ.వందల కోట్లు వసూలు చేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. వెంటనే ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీపీఐ నేతలు చలపతి, నదియా, రవి, పద్మనాభరెడ్డి, రాజా, విజయమ్మ, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ క్రైంపై అవగాహన అవసరం

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా ఆన్‌లైన్ నేరాలు పెరిగిపోతున్నాయని, వీటిపై మహిళలు అవగాహన పెంచుకోవాలని తిరుపతి మహిళా పోలీసు స్టేషన్ సీఐ తమీమ్ అహ్మద్ కోరారు. సెట్విన్ ఆధ్వర్యంలో గురువారం మహిళలకు ఆన్‌లైన్ నేరాల నుంచి రక్షణ పొందడంపై అవగాహన కల్పించారు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాలు, రద్దీ ప్రదేశాల్లో వీటిపై అవగాహనా కల్పించాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో సెట్విన్ సీఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

కార్తీక్ లైవ్ ఈవెంట్‌ను ఆదరించండి



తిరుపతి (లీలామహల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తారకరామ స్టేడియంలో 26న జరిగే కార్తీక్ లైవ్ ఈవెంట్‌ను ఆదరించాలని నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు బుక్‌మైషో యాప్ ద్వారా ఆరువేలకు పైగా టికెట్లు అమ్ముడుపోయాయని తెలిపారు. మొదటి సారిగా తిరుపతిలో ఈవెంట్ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్లు రూ.500 నుంచి రూ.4,500 వరకు అందుబాటులో ఉన్నాయన్నారు. సమావేశంలో జయప్రకాష్, చాణుక్య, సజిద్‌లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు సముచితస్థానం హర్షణీయం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రుద్రకోటి సదాశివం, వాయిద్య కళాకారులు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల పాలకమండళ్లలో నాయీ బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం అన్నారు. ఈ మేరకు బిల్లును మంత్రివర్గం ఆమోదించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గురువారం స్థానిక యూత్ హాస్టల్ ప్రాంగణంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఆలయాల్లో పనిచేసే నాయీ బ్రాహ్మణులకు కనీస వేతనంతో పాటు ఈ నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మునిరత్నం, గోవిందశెట్టి, రామచంద్రయ్య, కోటేశ్వరరావు, జ్ఞానశేఖర్, లోకేష్, నాని, విష్ణువర్ధన్, హరీష్, మోహిత్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హియా జ్యూవెలరీ వార్షికోత్సవం


జ్యోతి వెలిగిస్తున్న రాయపాటి రాధిక కుమార్

చంద్రగిరి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తిరుపతిలో కేటీ రోడ్డులోని అన్నారావు కూడలిలో హియా జ్యూవెలరీ 5వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా షోరూమ్ అధినేత్రి రాయపాటి రాధికా కుమార్ జ్యోతి వెలిగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తమ షోరూం వార్షికోత్సవంలో భాగంగా కుందన్, పచ్చి, విక్టోరియన్ బంగారు ఆభరణాలపై తరుగు ఉండదని, డైమండ్ జ్యూవెలరీ క్యారెట్ ధర యాభై ఆరువేలు మాత్రమేనని తెలిపారు. ఈ ఆఫర్ రెండు రోజులు మాత్రమేనన్నారు. కస్టమర్లు వినియోగించుకోవాలని కోరారు.

రేపు గంగమ్మగుడిలో లీజు వేలం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మగుడిలో శనివారం లీజు వేలం నిర్వహించనున్నట్లు ఈవో ఒక ప్రకటనలో తెలిపారు. 2024 నవంబర్ ఒకటి నుంచి 2025 అక్టోబర్ 31 వరకు ఆలయానికి సంబంధించి చీరలు, రవిక పీసుల సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ, వెయ్యికళ్ల దుత్తల విక్రయం, సజీవ కోళ్ల సేకరణ, పాదరక్షలు భద్రపరుచు లీజు హక్కులకు సంబంధించి ఉదయం 11 గంటలకు ఆలయంలో వేలం జరుగుతుందని తెలిపారు. పూర్తి వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ కార్యవర్గం

తిరుపతి(ఆటోనగర్) అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ సదరన్ డిస్కం తిరుపతి సర్కిల్ పరిధిలోని ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ఒక హోటల్లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో డిప్లొమా ఇంజనీర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం అధ్యక్షుడిగా జి.వెంకటరమణ, కార్యదర్శిగా ఎ.మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వి.అంజాద్ ఖాన్, కోశాధికారిగా టి.వెంకటపురుషోత్తం, మహిళా విభాగం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్.రూపస్విలక్ష్మి ఎన్నుకున్నారు. వీరు తిరుపతి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారని నూతన అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు.

వినతులను పరిష్కరించండి


కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నేతలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని సీపీఎం నాయకులు కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రతి సోమవారమూ జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వ్యయప్రయాసల కోర్చి వచ్చి అర్జీలు ఇస్తున్నా చాలావరకు పరిష్కారం కావడం లేదన్నారు. మండల స్థాయిలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోకుండా కలెక్టరేట్‌కు రమ్మనడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పాల్గొన్నారు.

షిరిడీసాయి ఆలయానికి రూ.లక్ష విరాళం


విరాళం అందజేస్తున్న పద్మావతి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని కోర్టు పక్కనున్న షిరిడీ సాయిబాబా ఆలయానికి బొమ్మగుంటకు చెందిన పద్మావతి రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ కమిటీ సభ్యులు సునీల్ చక్రవర్తి, శ్రీనివాసులుకు గురువారం అందజేశారు. దాతను ఘనంగా సత్కరించారు. 31వ డివిజన్ కార్పొరేటర్ సీకే రేవతి పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో ఉద్యోగుల క్రీడా పోటీలు

తిరుపతి (క్రీడలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్రీడా సాధికార సంస్థ తిరుపతి ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో ఆలిండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగుల జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ గురువారం తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే అర్హులని, ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, కార్యాలయ గుర్తింపు కార్డు, పై అధికారి ధ్రువీకరణతో 29వ తేదీ ఉదయం 9 గంటలకు శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో హాజరుకావాలని కోరారు. ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్రస్థాయి సివిల్ సర్వీస్ క్రీడా పోటీలకు పంపుతామని తెలిపారు. వివరాలకు డీఎస్‌డీవోను సంప్రదించాలని కోరారు.


అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణం


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాలువ నిర్మాణం పూర్తయ్యేనా?

తిరుమల బైపాస్ రోడ్డులో అసంపూర్తిగా పనులు ● రహదారిపైనే మురుగు నీరు

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): భారీ వరదలు వచ్చినా నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేలా తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్ నుంచి లీలామహల్ వరకు ఎనిమిది నెలల క్రితం కాలువ నిర్మాణ పనులు చేపట్టారు. మొదట్లో జోరుగా సాగిన పనులు అర్థంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం వాటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. చుట్టుపక్కల ఇళ్లలోని డ్రైనేజీలను కాలువకు అనుసంధానం చేయడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడాల్సి వచ్చింది. స్థానికులు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండాపోతోంది. దీనిపై కార్పొరేషన్ అధికారులను వివరణ కోరగా కోర్టు కేసు కారణంగా పనులు ఆగాయని తెలిపారు. కేసు తేలేవరకైనా రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది.

'ఊహల్లో జీవితాలు' సినిమా పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి (లీలామహల్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): చిన్మయి క్రియేషన్స్ పతాకంపై రూపుదిద్దుకోనున్న ఊహల్లో జీవితాలు సినిమా పోస్టర్‌ను దర్శకులు సుభాష్‌బాబు చిత్ర యూనిట్ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ శ్రీవారి ఆశీర్వాదం కోసం తిరుపతిలో ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. ఈ చిత్రం ముగ్గురు హీరోలతో నడుస్తుందని వివరించారు. రాజధానిలో ఒక్కడు తన మొదటి చిత్రమని, ఇది రెండో చిత్రమని, జనవరిలో షూటింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. సమావేశంలో చిత్ర నటీనటులు కరాటే ధనంజయ్, యూట్యూబర్ స్టార్‌లు పొట్టి మామా రవీంద్ర, ప్రజ్వల, బెంగళూరు పద్మ, రెడ్డెప్ప, జూనియర్ తెలంగాణ శకుంతల, రాజమండ్రి లక్ష్మి, రాజు, నాయక్‌బాయ్‌లు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 24 (ఆంధ్రజ్యోతి): గోవిందరాజ స్వామి ఆలయంలో గురువారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఏటా దీపావళి ఆస్థానం సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 6.30నుంచి 9 గంటల వరకు ఆలయాన్ని పవిత్ర ద్రవ్యాలతో శుద్ధి చేశారు. 11 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతించారు. 30వ తేదీ దీపావళి సందర్భంగా సాయంత్రం 4 నుంచి 5.30 వరకు శ్రీవారిసన్నిధి, పార్థస్వామి సన్నిధి, ఆండాళ్ అమ్మవారి సన్నిధిలో తైల సమర్పణ చేస్తారు.

దీపావళి ఆస్థానం

దీపావళి పండగ సందర్భంగా 31వ తేదీ సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటలకు గోవిందరాజస్వామి ఆలయంలో దీపావళి ఆస్థానం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని పుండరీకవల్లీ అమ్మవారి ఆలయం నుంచి నూతన వస్త్రాలు, దీపాలను తీసుకువచ్చి, గోవిందరాజ స్వామికి సమర్పిస్తారు.

బస్టాండులో ఉచిత మరుగుదొడ్లు

తిరుపతి(ఆర్టీసీ),అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులో ఉచిత మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. వెంకటగిరి పాయింట్ వద్ద నిన్నటి వరకు నగదువసూలుతో నడిచిన మరుగుదొడ్లను బుధవారం నుంచి నిర్వాహకులు ఉచితంగా మార్చారు. వచ్చేనెల 6న టెండర్ ముగియనుండడంతో నిర్వాహకుడు కొన్ని రోజులైనా ప్రయాణికులకు సేవలందించాలని భావించి ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

ఎట్టకేలకు కల్వర్టు పనుల ప్రారంభం


కల్వర్టు నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్న కూలీలు

తిరుపతి అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులో ఎట్టకేలకు కల్వర్టు నిర్మాణ పనులు మొదలయ్యాయి. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీనివాసం, మాదవం విశ్రాంతి గృహాల నుంచి మురుగునీరు బోత్ హాస్పిటల్ వద్ద అండర్ డ్రైనేజీ పైపుల ద్వారా రోడ్డు దాటుతుంది. ఇవి చిన్నవిగా ఉండడం, తరచూ వ్యర్థాలతో నిండిపోవడంతో వర్షపు నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతోంది. ప్రతిసారీ రోడ్డు తవ్వి తూములో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాల్సి వస్తోంది. తద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కల్వర్టు నిర్మాణమే పరిష్కారమని భావించి, నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం పనులు ప్రారంభించారు. నెల రోజుల్లో పనులు పూర్తిచేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

తిరుపతి ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీగా నరసింగప్ప

సెలవుపై వెళ్లిన రామకృష్ణమాచారి

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి ట్రాఫిక్ ఇన్‌చార్జి డీఎస్పీగా నరసింగప్పను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్పీ రామకృష్ణమాచారి వ్యక్తిగత పనులపై 20 రోజుల పాటు సెలవు పెట్టడంతో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీగా ఉన్న నరసింగప్పను తాత్కాలికంగా నియమించారు. గురువారం ఆయన తిరుపతిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి ట్రాఫిక్ తీరును పరిశీలించారు. ఫ్రీలెఫ్టులు, వన్‌వేల అమలు తీరుపై ఆరా తీశారు.

బాలిక అదృశ్యం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 17 ఏళ్ల బాలిక అదృశ్యమైనట్లు తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. తిరుపతి పరసాల వీధికి చెందిన లక్ష్మీకుమారి కుమార్తె ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. రెండు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆ బాలిక తిరిగి రాలేదు. తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసినా లాభం లేకపోయింది. లక్ష్మీకుమారి గురువారం వెస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పల్లెవీధికి చెందిన నిరంజన్ తన కుమార్తెకు తీసుకెళ్లి ఉంటాడని ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసిన సీఐ రామకృష్ణ దర్యాప్తు చేస్తున్నారు. నిరంజన్ మొబైల్ నంబరు ఆధారంగా చెన్నైలో ఉన్నట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలను పంపనున్నట్లు చెప్పారు.



'బెంగాల్' నాట్లు

సాధారణంగా వరి నాట్లంటే స్థానికంగా ఉన్న మహిళా కూలీలు వేస్తుంటారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వీరు రూ.500 వరకు కూలి తీసుకునేవారు. కానీ, ఏడాదిన్నరగా బెంగాల్ నుంచి మగ కూలీలొస్తున్నారు. కోట, వాకాడు, చిట్టమూరు ప్రాంతాలలో వీరు వరి నాట్లు వేస్తున్నారు. ఎకరా పొలంలో నాట్లు వేసేందుకు 4,300 రూపాయలు తీసుకుంటున్నారు. కాగా, వరినాట్లకు బెంగాల్ మగకూలీలకు డిమాండు పెరిగింది.

- కోట, ఆంధ్రజ్యోతి

గూడలి వద్ద వరినాట్లు వేస్తున్న కూలీలు

'విజ్ఞానగిరి' వద్ద మద్యం దుకాణం వద్దు

శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున సుబ్రహ్మణ్యేశ్వర స్వామికొలువైన విజ్ఞానగిరి (కుమారస్వామి తిప్ప) ఆలయం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ మహిళలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు గురువారం ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ప్రాంతంలో విద్యాసంస్థలు, ఆస్పత్రితో పాటు ఆలయం, ముక్కంటి ఆలయ నారదపుష్కరణి ఉన్నట్లు వివరించారు. వైసీపీ పాలనలోనూ కుమార స్వామి తిప్ప వద్ద మద్యం దుకాణం ఏర్పాటుకు అధికారులు ప్రయత్నించగా తమ నిరసనతో ఆపేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుకు కొందరు ప్రయత్నిస్తున్నారని.. ఈ ప్రాంత ప్రాశస్త్యం రీత్యా అనుమతి ఇవ్వొద్దని కోరారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఎక్సైజ్ సీఐ లావణ్యకు వినతిపత్రం ఇస్తున్న మహిళలు

గ్రంథాలయ విద్యలో 50 ఏళ్లు

● నేటి నుంచి ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ విభాగ స్వర్ణోత్సవాలు

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంథాలయాలు సమాజంలో నిలిచాయి. ఎస్వీయూలో లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్ 1974లో ప్రారంభమైంది. తొలుత బీఎల్ఐఎస్‌సీ కోర్సు నిర్వహించింది. ప్రస్తుతం ఎంఎల్ఐఎస్‌సీ, పీహెచ్‌డీ కోర్సులు నిర్వహిస్తూ ఉంది. తొలి రోజుల్లో ఎస్.శ్రీపతి నాయుడు, ఎన్.గురుస్వామి నాయుడు, టి.రాజగోపాల్ తదితరులు ఆచార్యులుగా ఈ విభాగంలో సేవలు అందించారు. ప్రస్తుతం ఒక రెగ్యులర్ ఫ్యాకల్టీతో పాటు మిగతా అకడమిక్ కన్సల్టెంట్లు బోధన సాగిస్తూ ఉన్నారు. లైబ్రరీ సైన్స్ డిపార్ట్‌మెంట్‌లో ఇప్పటి వరకు 89 పీహెచ్‌డీలు, 32 ఎంఫిల్ డిగ్రీలు పూర్తయ్యాయి. చిన్నారుల్లో పుస్తక అధ్యయనం పట్ల ఆసక్తిని పెంచడంపై ఒక పరిశోధనా ప్రాజెక్టు నిర్వహించారు. పీజీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఏటా నాలుగు బంగారు పతకాలు ప్రదానం చేస్తున్నారు. పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులను నిర్వహించారు. గ్రంథాలయ నిర్వహణ పట్ల విద్యార్థులకు ప్రయోగాత్మకంగా అవగాహన కలిగిస్తున్నారు. ఇలా బోధన, పరిశోధన, విస్తరణ రంగాల్లో సేవలు అందించింది. గ్రంథాలయ విద్యలో ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దింది. పూర్వ విద్యార్థులు ప్రస్తుతం అనేక చోట్ల ఉన్నత స్థానాల్లో రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం స్వర్ణోత్సవాలు నిర్వహించుకోనుంది.



శ్రీపతి నాయుడు



గురుస్వామి నాయుడు

- తిరుపతి(విశ్వవిద్యాలయాలు), (ఆంధ్రజ్యోతి)



లైబ్రరీ సైన్స్ విభాగం

ఘనమైన స్ఫూర్తిని కొనసాగిస్తాం



యాభై ఏళ్ల సుదీర్ఘ చరిత్రను ఒకసారి సమీక్షించుకుంటాం. గడిచిన చరిత్రను గుర్తు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో చేయవలసిన అభివృద్ధికి అవసరమైన స్ఫూర్తిని పొందుతాం. ఇలా లైబ్రరీ సైన్స్ విభాగాన్ని మరింతగా అభివృద్ధి చేయడానికి ప్రయత్నిస్తాం.

- ప్రొఫెసర్ ప్రశాంతికుమారి, హెడ్, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్

నేడు స్వర్ణోత్సవ సంబరం : లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ స్వర్ణోత్సవ సంబరం శుక్రవారం నుంచి రెండు రోజుల పాటు జరగనుంది. ఉదయం 10 గంటలకు సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందులో ఇన్‌చార్జి వీసీ అప్పారావు, ద్రవిడ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ దొరస్వామి, వర్సిటీ రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ప్రిన్సిపాల్ సుధారాణి, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.సురేంద్రబాబు, లైబ్రరీ సైన్స్ హెడ్ ప్రశాంత కుమారి పాల్గొంటారు. గోల్డెన్ జూబ్లీ సావనీర్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైసీపీ గురివింద రాజకీయం



● ఎస్వీయూ స్టేడియంలో కార్తీక్ షోపై విమర్శలు
● అద్దెకు ఇవ్వడం ఏమిటంటూ రాద్ధాంతం
● మరి జగన్ పాలనలో చేసిందేమిటి?

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తారకరామ స్టేడియాన్ని ప్రముఖ నేపథ్య గాయకుడు కార్తీక్ లైవ్ షోకు ఇవ్వడంపై వైసీపీ గురివింద రాజకీయం చేస్తోంది. స్టేడియాన్ని ప్రైవేట్ షోలకు ఇస్తూ విశ్వవిద్యాలయాన్ని అధికార పార్టీ భ్రష్టు పట్టిస్తోందని జగన్ పత్రికలో కథనాలు వేశారు. ఎస్వీయూ స్టేడియంలో ప్రైవేట్ కార్యక్రమాల నిర్వహణ కొత్తేమీ కాదన్న విషయం తెలిసీ అధికారులపై విమర్శలు గుప్పించారు. దీనివెనుక టీడీపీ ఉందంటూ ఆరోపించడంపై పలువిద్యార్థి సంఘాలు, వర్సిటీ వర్గాలు మండిపడుతున్నాయి. నిబంధనల మేరకు ఓ సంగీత కార్యక్రమానికి స్టేడియాన్ని అద్దెకు ఇస్తే అసత్యప్రచారం చేయడం తగదని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో వర్సిటీ ప్రాంగణంలోనే అనేక రాజకీయ కార్యక్రమాలను నిర్వహించారని గుర్తుచేశారు.

ఎప్పటినుంచో అద్దెకు ఎస్వీయూ స్టేడియం

1954 నుంచీ యూనివర్సిటీకి స్టేడియం ఉంది. 1966లో ఆధునికీకరించారు. సుమారు పది ఎకరాల విస్తీర్ణంతో 10 వేల మందికి పైగా సామర్థ్యంతో స్టేడియం ఉంది. వర్సిటీ అవసరాలకు ఉపయోగించుకుంటూనే, బయటి వ్యక్తులకు క్రీడా, సినిమా, సాంస్కృతిక, సంగీత ప్రదర్శనలకు కేటాయిస్తూ వస్తున్నారు. దీనికి అద్దె వసూలు చేస్తున్నారు. బయటి వ్యక్తులకు క్రీడా పోటీలకు రోజుకు రూ. 5 వేల చొప్పున ధరలు నిర్ణయించారు. గతంలో ఇది రూ.4 వేలు ఉండగా, ఇటీవల నిర్వహించిన స్పోర్ట్స్ బోర్డ్ మీటింగ్‌లో రూ. 5 వేలు చేశారు. నాన్ కమర్షియల్ కోసమైతే రోజుకు రూ. లక్ష, మరో రూ.25 వేలు నిర్వహణ కోసం కట్టించుకుంటారు. కమర్షియల్ అయితే రూ.3 లక్షల రుసుంతో పాటు నిర్వహణ కింద మరో రూ.50 వేలు ధర నిర్ణయించారు. ప్రస్తుతం లైవ్ షోకు రూ.3.5 లక్షలు నిర్వాహకులు చెల్లించారు. గతంలో బాహుబలి, ఆదిపురుష్ వంటి సినిమా ఫంక్షన్లనూ ఎస్వీయూ తారకరామ స్టేడియంలోనే నిర్వహించారు. దీనికి అనుమతులు, అద్దెనూ ఇదే తరహాలో చేశారు. అయితే, కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో పట్ల కొందరు రాద్ధాంతం చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తమవుతోంది. యూనివర్సిటీల్లో అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర, క్రీడా, సినిమా, సాంస్కృతిక, మ్యూజిక్, బుక్ రిలీజ్ వంటి కార్యక్రమాలు నిరంతరంగా సాగుతున్నాయి.

ఎప్పటి నుంచో అద్దెకు ఇస్తున్నాం

తారకరామా స్టేడియాన్ని ఎప్పటి నుంచో అద్దెకు కేటాయిస్తున్నాం. ఇదంతా యూనివర్సిటీ నియమ నిబంధనల ప్రకారమే చేస్తున్నాం. ప్రస్తుతం కార్తీక్ లైవ్ మ్యూజిక్ షో నిర్వాహకులు అనుమతి కోరారు. ముందుగానే అద్దె చెల్లించారు. అందుకే అనుమతించాం.

- ప్రొఫెసర్ శివశంకర్‌రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగ డైరెక్టర్, ఎస్వీయూ

కార్తీక్‌షో వల్ల ఇబ్బందేమి?

నిబంధనల ప్రకారం రోజుకు రూ.3.5 లక్షలను నిర్వాహకులు ఇప్పటికే చెల్లించారు. స్టేడియాన్ని అధికారికంగానే కేటాయించినా ఇలాంటి విమర్శలు చేయడం దారుణమని యూనివర్సిటీ వర్గాలు పేర్కొంటున్నాయి. బయటి వ్యక్తులకు అద్దెకు స్టేడియంను కేటాయించిన నేపథ్యంలో నిర్వాహకులు వారి ఇష్ట ప్రకారం నిర్వహణను చేపట్టనున్నారు. ఈ వ్యవహారంతో యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఎలాంటి సంబంధం ఉండదు. అధికారులతో పాటు ఎలాంటి సంబంధం లేని వ్యక్తులనూ ఈ వ్యవహారంలోకి లాగుతుండటం గమనార్హం. ఇక, ఈ కార్యక్రమం ఎలాంటి అసభ్యకరమైన డ్యాన్స్‌లతో కూడినది కాదు. వారాంతంలో.. ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 నుంచి 10 గంటల వరకూ మ్యూజిక్ షో ఉంటుంది. దీనివల్ల పని వేళల్లో విద్యార్థులు, ఉద్యోగులకు కూడా ఇబ్బంది తలెత్తే అవకాశం లేదు. అయినా కొందరు వివాదాస్పదం చేయడం గమనార్హం. యూనివర్సిటీ అధికారులను ఇబ్బందులకు గురి చేయాలనే ఆలోచనతో ప్రభుత్వానికి కూడా ఫిర్యాదు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

సమావేశంలో మాట్లాడుతున్న వసుధమిశ్రా



పారిశ్రామిక భద్రతే ధ్యేయం

● రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పారిశ్రామిక భద్రతను మెరుగుపరచడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని రాష్ట్ర పరిశ్రమల ఉన్నత స్థాయి కమిషన్ చైర్‌పర్సన్ వసుధామిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం సాయంత్రం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లతో ఆమె సమావేశమయ్యారు. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం ఉన్నతస్థాయి కమిటీని నియమించిందన్నారు. పరిశ్రమల్లో ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీలు నిర్వహించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. పర్యావరణం, అటవీ, సైన్స్ టెక్నాలజీ కార్యదర్శి అనంతరాము మాట్లాడుతూ పరిశ్రమల్లో మౌలిక సదుపాయాలు, మానవ వనరుల పరంగా సంస్థలను బలోపేతం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యదర్శి ఎంఎంనాయక్ పరిశ్రమల భద్రతపై పలు సూచనలు చేశారు. అంతకు ముందు జిల్లాలోని పలు పరిశ్రమలను సందర్శించి, ప్రతినిధులతో చర్చించారు.సమావేశంలో తిరుపతి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల కలెక్టర్లు వెంకటేశ్వర్, సుమిత్ కుమార్, ఆనంద్, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి శరవణన్, ఇతర అధికారులు, వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు పూర్తిచేస్తాం : సీఈ



మల్లికార్జున్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కుప్పం బ్రాంచ్ కెనాల్, హంద్రీనీవా బ్రాంచ్ కెనాల్, తిరుపతికి తాగునీరు అందించేందుకు బాలాజీ రిజర్వాయర్, మల్లిమడుగు రిజర్వాయర్ పనులను త్వరలోనే పూర్తి చేస్తామని ఎన్టీఆర్ తెలుగుగంగ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ ఎం.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులతో పాటు హంద్రీనీవా పనులు పూర్తిచేసి ప్రజలకు నీటిని అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతి యాత్రా స్థలం కావడంతో తాగునీటి సమస్య తలెత్తకుండా బాలాజీ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తామన్నారు.

12 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరు స్మగ్లర్లను పోలీసులు అరెస్టుచేశారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. విశాఖ నుంచి తిరుపతికి గంజాయి రవాణా జరుగుతున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. ఈ మేరకు పట్టణ శివారులోని బైపాస్ వంతెన వద్ద పీఎన్ జాతీయ రహదారిపై రెక్కీ నిర్వహించారు. ఆ సమయంలో చిత్తూరు జిల్లా ఎస్ఆర్‌పురం మండలం ఏఎంపురం అరుంధతివాడకు చెందిన పన్నూరు బాబు(63), ఒడిశా రాష్ట్రం గజపతి జిల్లా ఉదయగిరి గ్రామానికి చెందిన రాజన్‌కుమార్(41) గంజాయితో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయితో పాటు రూ.4వేల నగదు సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



రాజన్‌కుమార్



పన్నూరుబాబు

పాకాలలో మరో ఆరు కిలోలు..

పాకాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆరు కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పాకాల సీఐ మద్దయ్య ఆచారి గురువారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు పాకాల రైల్వే స్టేషన్ వద్ద పోలీసులు గురువారం మాటువేశారు. బ్యాగుతో బయటకు వచ్చిన ఓ బ్యాగు.. పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడులోని కడలూరు జిల్లా చొక్కానాథపాళ్యంకు చెందిన శరవణ శంకర్‌గా గుర్తించారు. లీనా అనే వ్యక్తి నుంచి రూ.15,000 తీసుకొని విశాఖ నుంచి చెన్నైకి గంజాయి రవాణా చేస్తున్నట్లు నిందితుడు తెలిపాడు. ఇతడిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు సీఐ తెలిపారు. ఆరు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఏఎస్ఐ వెంకటరత్నం నాయుడు, హెడ్‌కానిస్టేబుల్ సోమశేఖర్‌నాయుడు, చలపతి, కానిస్టేబుళ్లు పాల్గొన్నారన్నారు.

డిజిటల్ వ్యాపారంలో మహిళలు రాణించాలి



కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు రాణించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలకు చేపట్టిన శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు ఎదగాలని కోరారు. డిజిటల్ వ్యాపార రంగంలో మహిళలు తమ శక్తి సామర్థ్యాలను ఉపయోగించాలన్నారు. ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. పద్మావతి వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఉమ మాట్లాడుతూ మహిళలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా మహిళా సాధికారతకు మహిళా యూనివర్సిటీ దోహదం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరిదేవి, ఏపీసీఐసీటీ డైరెక్టర్ కియాంగ్‌కో, కన్సల్టెంట్ ఉషావ్యాసులరెడ్డి, రిజిస్ట్రార్ రజని, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ దుర్గాభవాని, ప్రొఫెసర్ విజయలక్ష్మి, పలు ప్రాంతాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన పారిశ్రామిక భద్రతా కమిటీ తనిఖీలు

శ్రీసిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో రాష్ట్ర పారిశ్రామిక భద్రతా ప్రమాణాల కమిటీ బృందం నిర్వహిస్తున్న తనిఖీలు గురువారం ముగిశాయి. రాష్ట్రంలోని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలను పరిశీలించేందుకు విశ్రాంత ఐఏఎస్ అధికారి వసుధ మిశ్రా నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పారిశ్రామిక భద్రతా కమిటీ శ్రీసిటీలో మూడు రోజులుగా వివిధ పరిశ్రమల్లో తనిఖీలు చేపట్టింది. ఈ పర్యటనలో కమిటీలోని ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు శ్రీసిటీలోని డైకిన్, కింబర్లీ క్లార్క్, అల్‌స్టోం తదితర పరిశ్రమలలో తనిఖీలు నిర్వహించారు.



డైకిన్ పరిశ్రమను సందర్శించిన కమిటీ బృందం

మద్యం మత్తులో ఎస్ఐతో దురుసు ప్రవర్తన

● వీఆర్‌కు హెడ్ కానిస్టేబుల్

భాకరాపేట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.భాకరాపేట సీఐ ఇమ్రాన్‌బాషా కథనం మేరకు...బుధవారం రాత్రి చంద్రశేఖర్ గస్తీ నిర్వహిస్తుండగా ఎర్రావారిపాలెం ఎస్ఐ ఎర్రిస్వామి భాకరాపేట బీట్ తనిఖీ చేశారు. ఆ సమయంలో మద్యం మత్తులో వున్న చంద్రశేఖర్ ఎస్ఐ పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో హెడ్‌కానిస్టేబుల్‌పై ఉన్నతాధికారులకు ఎస్ఐ ఫిర్యాదు చేశారు. అధికారులు విచారించి చంద్రశేఖర్‌ను వీఆర్‌కు పంపుతూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

21 నుంచి సాగునీటి సంఘ ఎన్నికలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 631 సాగు నీటి సంఘాలకు నవంబర్ 21 నుంచి 23వ తేదీ వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని నీటి పారుదల, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈనెల 31న గ్రామ పంచాయతీల్లో ఓటర్ల జాబితా ప్రదర్శించి, వచ్చేనెల ఒకటో తేదీలోపు అభ్యంతరాలు స్వీకరించాలని పేర్కొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో పెన్షన్ అదాలత్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు సంబంధించి జీపీఎఫ్ పెన్షన్ సమస్యల పరిష్కారం కోసం పెన్షన్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఖజానా, లెక్కల అధికారి లక్ష్మీకరరెడ్డి తెలిపారు. పెన్షనర్లకు, జీపీఎఫ్‌కు సంబంధించిన సమస్యలు తెలిపితే అక్కడే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తిరుచానూరు ఆలయంలో భారీగా బదిలీలు

తిరుచానూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో ఏళ్ల తరబడి తిష్ట వేసుకున్న కొంతమంది అధికారులు, సిబ్బందిని బదిలీ చేస్తూ గురువారం టీటీడీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏఈవో రమేష్‌ను హైదరాబాద్‌లోని టీటీడీ సమాచార కేంద్రానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుమల ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న దేవరాజులను నియమించారు. సూపరింటెండెంట్ శేషగిరిని హెచ్ఆర్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఆయన స్థానంలోఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల సూపరింటెండెంట్ ప్రసన్నకుమార్‌ను నియమించారు. ఆర్జితం ఇన్‌స్పెక్టర్ గణేష్‌ను డిప్యూటీ ఈవో కార్యాలయానికి, అక్కడ పనిచేస్తున్న మురళిని బదిలీ చేశారు. ప్రసాదాల ఇన్‌స్పెక్టర్ ప్రసాద్‌ను ఉగ్రాణానికి, అక్కడ పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్ జయకుమార్‌ను హెచ్ఆర్‌లో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్జితం ఇన్‌స్పెక్టర్‌గా సుబ్బరాయులు, ప్రసాదాల ఇన్‌స్పెక్టర్‌గా చలపతిని నియమించారు.

రేపటి నుంచి ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్జీఎఫ్ అండర్ 19 రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు శనివారం నుంచి నిర్వహించనున్నట్లు స్కూల్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల బాలబాలికలు 10వ తరగతి మార్కులిస్టు, స్టడీ, ఆధార్ జిరాక్సులు వెంట తీసుకురావాలని పేర్కొన్నారు. క్రీడా పోటీల తేదీలు, ఇతర వివరాలకు 26న బాలాజీ కాలనీలోని విశ్వేశ్వర యోగా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో యోగాసనం పోటీలు(9393621004), 27న మధ్యాహ్నం 3.30గంటల నుంచి శ్రీనివాస క్రీడా సముదాయంలో మహిళా క్రికెట్(9393621004), 27న ఉదయం 9.30నుంచి రేణిగుంట జిల్లా పరిషత్ పాఠశాలలో సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్(8712257060), 30న ఉదయం 9.15 గంటల నుంచి చిత్తూరులోని డీఎస్ఏ స్టేడియంలో ఖోఖో, రోప్ స్కిప్పింగ్, ఫెన్సింగ్(9440674457) సంప్రదించాలని సూచించారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

5 టిప్పర్లు సీజ్

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్, చంద్రశేఖరపురం, చిటేడు, కేశవరం గ్రామాల్లో తిరుగుతున్న వాహనాలపై గురువారం గనులశాఖలోని విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రోడ్డు నిర్మాణానికి సంబంధించి పనులు చేస్తున్న సంస్థకు చెందిన 5 టిప్పర్లు మైనింగ్‌శాఖకు ఎలాంటి రాయితీలు చెల్లించకుండా, అనుమతులు లేకుండా మట్టి రవాణా చేస్తుండటంతో విజిలెన్స్ అధికారులు అదుపులోకి తీసుకొని సీజ్‌చేసి కోట పోలీసులకు అప్పగించారు. మైనింగ్‌శాఖ గుంటూరు, ప్రకాశం, ఉమ్మడి నెల్లూరు జిల్లాల జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు మైనింగ్‌శాఖకు చెందిన రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, విజిలెన్స్ అధికారులు ఈ దాడులు చేశారు.

చెరువు కట్టను ఆనుకుని అక్రమ నిర్మాణాలు

- అడ్డుకున్న గూడూరు మున్సిపల్, ఇరిగేషన్ అధికారులు

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోటుపాళెం జాతీయరహదారి సమీపంలోని చెరువుకట్ట సమీపంలో నిర్మిస్తున్న అక్రమకట్టడాలను అధికారులు అడ్డుకున్నారు. గురువారం కట్టడాలను ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు పరిశీలించారు. చెరువుకట్టను ఆనుకుని కొందరు గతంలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో కొద్దిరోజులుగా భవన నిర్మాణాలు చేపట్టేందుకు కొందరు పనులు చేపట్టారు. చెరువుకట్టకు, గూడూరు వచ్చే ప్రధానరహదారికి సమీపంలో కట్టడాలను నిర్మించేందుకు భారీ గోతులు తీశారు. దీంతో చెరువు కట్టలు బలహీన పడుతాయని, భవిష్యత్తులో ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలన్నా ఇబ్బందులు తప్పవని పలువురు రైతులు ఇరిగేషన్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణం కోసం తీసిన భారీ గోతుల్లో చెరువు నుంచి ఊట వస్తుండడంతో నిర్మాణాలు చేపడితే మున్ముందు ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉంటుందని, చెరువు బఫర్‌జోన్ కింద నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని రైతులు అధికారులను కోరారు. దీంతో ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు కట్టడాల కోసం తవ్విన భారీ గోతులను యుద్ధప్రాతిపదికన యంత్రాల సాయంతో పూడ్చివేయించారు. కార్యక్రమంలో ఇరిగేషన్‌శాఖ ఏఈ సురేష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అక్రమ కట్టడాలను పరిశీలిస్తున్న ఇరిగేషన్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు

625 కిలోల రేషన్‌బియ్యం పట్టివేత

- ముగ్గురి అరెస్ట్ - ఆటో, ద్విచక్రవాహనం స్వాధీనం

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రేషన్‌బియ్యం అక్రమంగా తరలిస్తుండగా గంగాధరనెల్లూరు పోలీసులు పట్టుకున్నారు. ఇన్‌చార్జి ఎస్‌ఐ వెంకటసుబ్బమ్మ తెలిపిన మేరకు.. గంగాధరనెల్లూరుకు సమీపంలోని ముక్కళత్తూరు క్రాస్ వద్ద గురువారం పోలీసులు వాహనాలు తనిఖీలు చేస్తున్నారు. చిత్తూరు సంతపేటకు చెందిన బాలాజీ, సుమతి దంపతులు ఆటోలో 545 కిలోల బియ్యాన్ని, మండలంలోని కొత్తవెంటకాపురానికి చెందిన కరుణాకరన్ ద్విచక్రవాహనంలో 80 కిలోల రేషన్ బియ్యాన్ని చిత్తూరుకు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీరు గ్రామాల్లో రేషన్‌బియ్యం కొనుగోలు చేసి చిత్తూరులో అధిక ధరలకు విక్రయాలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ముగ్గురినీ అరెస్ట్‌చేసి.. 625 కిలోల బియ్యంతోపాటు ఆటో, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్‌ఐ తెలిపారు.

బెంగళూరులో అపార్ట్‌మెంట్ కూలిన ఘటన

- మృతుల్లో గంగాధరనెల్లూరు మండలవాసి


తులసీరామ్‌రెడ్డి (ఫైల్ ఫొటో)

గంగాధరనెల్లూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో అపార్ట్‌మెంట్ కూలిన ఘటనలో గంగాధరనెల్లూరు మండలవాసి తులసీరామ్‌రెడ్డి మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంగాధరనెల్లూరు మండలం వింజం పంచాయతీ కృష్ణంపల్లెకు చెందిన పట్టాభిరెడ్డి కుమారుడు తులసీరామ్‌రెడ్డి (26)కి మూడేళ్ల కిందట సావిత్రితో వివాహమైంది. వీరికో కుమారుడు చేతన్‌సాయి ఉన్నాడు. బెంగళూరులోని భద్రప్పలేఅవుట్‌లో నివాసం ఉంటూ ప్లంబర్‌గా జీవనం సాగిస్తున్నాడు. బెంగళూరు బాబుసాబ్‌పాళ్యలో కొత్తగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తుండగా ఈనెల 22వతేదీ సాయంత్రం ఆరు అంతస్తుల అపార్ట్‌మెంట్ కూలిపోయింది. ఈ భవనం శిథిలాల కింద చిక్కుకుని మరణించిన వారిలో బుధవారం నాటికి ఎనిమిది మందిని గుర్తించారు. వీరిలో తులసీరామ్‌రెడ్డి కూడా ఉన్నాడు. ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించాక కృష్ణంపల్లెకు తరలించడంతో గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. గుమ్మడి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణతోపాటు పలువురు టీడీపీ, వైసీపీ నేతలు వేర్వేరుగా కృష్ణంపల్లెకు వచ్చి తులసీరామ్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి, కుటుంబీకులను పరామర్శించారు.

పేదలకు అండగా ఉంటాం


దుప్పట్లు పంపిణీ చేస్తున్న రాజేంద్ర, టీడీపీ నేతలు

కోట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): నిరుపేదలకు అండగా ఉండి తమ వంతు సహకారాన్ని ఎల్లవేళలా అందజేస్తామని ప్రముఖ బిల్డర్ మర్రిబోయిన రాజేంద్ర హామీ ఇచ్చారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీలో గల రాఘవాపురంలో గురువారం 300 మంది నిరుపేద వృద్ధులకు రాజేంద్ర దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. తన తల్లిదండ్రులైన జయరామయ్య, జయమ్మల జ్ఞాపకార్థం రాఘవాపురం, కేశవరం, సిద్ధమ్మకండ్రిగ గ్రామాల్లోని నిరుపేదలకు రాజేంద్ర దుప్పట్లను అందజేశారు. గిరిజనుల కాలనీలలో మౌలిక వసతుల ఏర్పాటుకు తనవంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ అధికార ప్రతినిధి వరిదిగొల్ల కోటేశ్వరప్రసాద్, మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, మస్తానయ్య, వెంకటరమణయ్య తదితరులు ఉన్నారు.

ఒకరి రక్తదానం.. మరెందరికో ప్రాణదానం


రక్తదాతలకు సర్టిఫికెట్ అందజేస్తున్న డీఎస్పీ

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్ర జ్యోతి): ఒకరు రక్తదానం చేయడం ద్వారా మరెందరికో ప్రాణదానం కలుగుతుందని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవాలలో భాగంగా గురువారం స్థానిక సామాజిక ఆరోగ్యకేంద్రంలో యువ నాయకులు పొట్లపూడి రాజేష్ ఆధ్వర్యంలో 25 మంది యువత రక్తదానం చేశారు. సామాజిక స్పృహ కలిగిన యువతను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణ, ఆస్తి, పరిరక్షణలో ప్రాణాలు త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు జోహార్లు అర్పించారు.

గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ

- ఎమ్మెల్యే సునీల్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే రాష్ట్ర వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని వాకాడు, ముట్టెంబాక, దుగరాజపట్నం పంచాయతీలలో గురువారం సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్థన్‌రెడ్డిపై గౌరవంతోనే వాకాడు టెంకాయలతోపు ప్రాంతానికి ఆయన పేరు పెట్టామన్నారు. వెలుగు సీసీలు, వీవోఏల పనితీరు మార్చుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేని భారీ గజమాలతో సత్కరించారు. నేతల దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, కృష్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, ప్రమీల, చంద్రయ్య, తహసీల్దారు రామయ్య, ఎంపీడీవో అన్నపూర్ణరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పారదర్శకంగా పరిహారం అందించాలి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సాగరమాల జాతీయ రహదారికి భూమి కోల్పోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం అందేలా చూడాలని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి అన్నారు. నాయుడుపేట మండలంలో సాగరమాలకు దాదాపు 95 ఎకరాలు భూసేకరణ చేశారు. ఈ క్రమంలో అన్నమేడు ప్రాంతంలో సాగరమాల భూములను ఆమె గురువారం పరిశీలించారు. ఆర్డీవో వెంట తహసీల్దారు గీతావాణి, డీటీ రాజేంద్ర, సర్వేయర్ తదితరులు ఉన్నారు.

అద్దెలు భరించలేం

- దుకాణదారుల నిరసన

కోట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలో పంచాయతీ దుకాణాలకు సంబంధించి అధికంగా విధించిన అద్దెలు చెల్లించలేమంటూ గురువారం దుకాణదారులు ఆందోళన, నిరసన తెలియజేశారు. కోటలోని 25 పంచాయతీ దుకాణాలను అద్దెకు తీసుకున్న యజమానులు అద్దెల భారం మోయలేమని ఆవేదన వ్యక్తంచేశారు. ఒక్కొక్క దుకాణానికి రూ.18,300 అద్దెలు విధిస్తే ఎలా చెల్లిస్తామన్నారు. పంచాయతీ అధికారులు, పాలకమండలి స్పందించి అద్దెలు తగ్గించాలని కోరారు.

బీరు బాటిల్‌తో దాడి

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24: నాయుడుపేట-మల్లాం జంక్షన్ కూడలి వద్ద ఈ నెల 22వ తేదీ రాత్రి మల్లాం జంక్షన్ కూడలి వద్ద గురవయ్య అనే వ్యక్తి పాత కక్షల కారణంగా గురునాథంపై బీరు బాటిల్‌తో దాడిచేసి గాయపరిచినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గురవయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచినట్లు సీఐ తెలిపారు.

ట్రైసైకిల్ పంపిణీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ టీడీపీ కార్యాలయంలో ఓజిలి మండలం మనవాలి గ్రామానికి చెందిన దివ్యాంగుడు సోమయ్యకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ట్రైసైకిల్‌ను పంపిణీ చేశారు.

పూడ్చి పెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం


గూడూరులో పూడ్చిపెట్టిన చెంచుకృష్ణయ్య మృతదేహాన్ని బయటకు తీసిన దృశ్యం

చిట్టమూరు, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం కోగిలిలో అనుమానాస్పదంగా మృతి చెందిన తుపాకుల చెంచుకృష్ణయ్య మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని కోగిలి రొయ్యల గుంటల వద్ద కాపలాగా ఉన్న చెంచుకృష్ణయ్య అనే గిరిజనుడు ఆదివారం అనుమానాస్పదంగా మృతి చెందాడు. భార్యతో గొడవ పడి గుళికలు తిని చనిపోయాడని బంధువులు చెప్పడంతో భార్య, బంధువులు కలసి గూడూరు స్వస్థలం కావడంతో మృతదేహాన్ని గూడూరుకు తరలించి, దహన సంస్కారాలు చేశారు. అయితే చెంచుకృష్ణయ్యను రొయ్యల గుంటల యజమాని వేధించడం వలనే ఆత్మహత్య చేసుకొని చనిపోయాడని, కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించాలని యానాదుల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దాంతో పోలీసులు మృతదేహాన్ని వెలికి తీయించి గూడూరు తహసీల్దార్ చంద్రశేఖర్ సమక్షంలో శవ పంచనామా నిర్వహించినట్లు ఎస్‌ఐ చిన్న బలరామయ్య తెలిపారు.

బందోబస్తు నడుమ అంత్యక్రియలు

పెళ్లకూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన బండి చెంచయ్య(49) ఆలియాస్ పోతురాజు చెంచయ్య మృతదేహానికి గురువారం మధ్యాహ్నం భారీ పోలీసు బందోబస్తు నడుమ అంత్యక్రియలు నిర్వహించారు. గురువారం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు చిల్లకూరు వడ్డిపాలెం తరలించారు. గ్రామంలో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు పర్యవేక్షణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా దొరవారిసత్రం ఎస్‌ఐ అజయ్‌కుమార్‌తో పాటు పోలీసులు గ్రామం చుట్టూ భారీ ఎత్తున మోహరించారు.

ఆగని 'వైసీపీ' దాష్టీకం

- అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న భవనంలోకి సచివాలయం తరలింపు
- అక్కడున్న పిల్లలను ఉరుస్తున్న పంచాయతీ భవనంలోకి..!
- ఆందోళనలో తల్లిదండ్రులు


పెచ్చులూడిన పంచాయతీ భవనం- ఉరుస్తుండడంతో పాత్రలు పెట్టిన దృశ్యం

బంగారుపాళ్యం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారినా వైసీపీ శ్రేణుల దాష్టీకం ఆగడం లేదు. బంగారుపాళ్యం మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీ భవనంలో సచివాలయం నిర్వహిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ భవనం పెచ్చులూడి, ఉరుస్తుండటంతో కంప్యూటర్, రికార్డులు తడుస్తున్నాయి. మరోవైపు సచివాలయ సిబ్బంది కూడా భయపడుతున్నారు. బుధవారం తంబుగానిపల్లె, మంగళపల్లె పంచాయతీకి గ్రామస్తులు మూడు గ్రామాలకు అనువైన రైతు సేవా కేంద్రానికి సచివాలయాన్ని తరలించడానికి ప్రయత్నించారు. దీన్ని జిల్లేడుపల్లెకు చెందిన వైసీపీ సానుభూతిపరులు అడ్డుకున్నారు. ఎంపీడీవో, ఇన్‌చార్జి ఎంపీడీవో, పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వైసీపీ సానుభూతి పరులు వినలేదు. స్థానిక సర్పంచ్ ఆధ్వర్యంలో అధికారుల మాట కూడా ఖాతరు చేయకుండా అదే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మిద్దెపైన ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయించి.. సచివాలయ ఫర్నిచర్‌ను తరలించేశారు. అక్కడున్న పిల్లలను ఉరుస్తున్న పంచాయతీ భవనంలోకి పంపేశారు. గురువారం ఆ పిల్లలు భవనంలోకి వెళ్లలేక ఆరుబయటే చదువుకుంటూ కనిపించారు. ఏదైనా ప్రమాదం జరిగితే పిల్లల మాటేంటని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంఈవో నాగేశ్వరరావును వివరణ కోరగా.. ఈ విషయంలో తనకెలాంటి సమాచారం లేదన్నారు.


ఆరుబయట అంగన్వాడీ పిల్లలు

పులివేటలో లోతుగా విచారణ

- పొలంలో తొలుత విద్యుదాఘాతం, ఆపై చంపేశారు
- త్వరలో మీడియా ముందుకు నిందితులు: డీఎఫ్‌వో


పులి అవశేషాలు - శ్రీగంధం ముక్కలు, ఆయుధాలు - మీడియాతో మాట్లాడుతున్న డీఎఫ్‌వో భరణి

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పులివేటలో మరింత లోతుగా విచారణ చేపట్టనున్నట్లు డీఎఫ్‌వో భరణి తెలిపారు. యాదమరి మండలం తాళ్లమడుగులో పులి చనిపోయిన ఘటన వివరాలను గురువారం పశ్చిమ ఎఫ్‌ఆర్‌వో కార్యాలయంలో మీడియాకు తెలిపారు. రైతు పొలంలో అడవి జంతువులను వేటాడటానికి అక్రమంగా వేసిన విద్యుత్ తీగల ఉచ్చులో పులి చిక్కింది. విద్యుదాఘాతంతో చనిపోయే స్థితిలో ఉన్న పులిని స్థానికులు చంపినట్లు పోస్టుమార్టం రిపోర్టులో తేలిందన్నారు. దాంతో పొలం యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించామన్నారు. మరో ఇద్దరు కూడా ఈ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారించగా.. బంగారుపాళ్యం వెలుతురుచేను గ్రామానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు కూడా ఈ ఘటనలో ఉన్నట్లు తేలిందన్నారు. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకుని లోతుగా విచారిస్తున్నామని తెలిపారు. అలాగే వారి వద్ద నుంచి పులి అవశేషాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. త్వరలోనే నిందితులను మీడియా ముందు ఉంచుతామని తెలిపారు. చెన్నైకి చెందిన క్రైం బ్యూరో రాజశేఖర్‌తోపాటు స్థానిక పోలీసుల సహకారం తీసుకున్నామన్నారు.

శ్రీగంధం విక్రయం కేసులో ముగ్గురి అరెస్టు

చిత్తూరు నగరంలో శ్రీగంధం అక్రమ విక్రయాల కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో తెలిపారు. అటవీ పశ్చిమ విభాగం సిబ్బందికి వచ్చిన సమాచారంతో ఈనెల 20న విచారణ చేయగా, నగరానికి చెందిన విజయకుమార్, చిత్తూరు రూరల్‌కు చెందిన రాజేంద్ర, గణేష్‌లను అదుపులోకి తీసుకున్నారని చెప్పారు. వీరి వద్ద నుంచి నాలుగు కిలోల శ్రీగంధం స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి.. రిమాండ్‌కు తరలించినట్లు డీఎఫ్‌వో వివరించారు. సమావేశంలో పశ్చిమ ఎఫ్ఆర్వో బాలకృష్ణారెడ్డి, డీఆర్వో ఆనందరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వసతి సముదాయానికి రూ.6.50 లక్షల విరాళం


దాతకు జ్ఞాపికను అందిస్తున్న కోదండపాణి

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలో వసతి సముదాయానికి పల్నాడు జిల్లా నరసారావుపేటకు చెందిన శ్రీనివాసరావు గురువారం రూ.6,50,000 విరాళంగా అందించారు. దాతలను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

25 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి బలమైన వర్షం కురిసింది. అత్యధికంగా వెదురుకుప్పంలో 45.2, అత్యల్పంగా చౌడేపల్లెలో 2మి.మీ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా.. గంగవరంలో 34.6, ఎస్‌ఆర్‌పురంలో 33.6, కుప్పంలో 29, రామకుప్పంలో 22.2, శాంతిపురంలో 20.8, పూతలపట్టులో 20.4, గుడుపల్లెలో 20.2, గుడిపాలలో 19.2, పలమనేరులో 15.4, బైరెడ్డిపల్లెలో 13.4, తవణంపల్లెలో 13, యాదమరిలో 12.6, బంగారుపాళ్యంలో 12, పెద్దపంజాణిలో 10.6, కార్వేటినగరంలో 9.6, పెనుమూరులో 9.4, పాలసముద్రంలో 7.6, గంగాధరనెల్లూరు 7.4, ఐరాలలో 7.2, చిత్తూరు రూరల్‌లో 5.8., చిత్తూరు అర్బన్, వి.కోటలో 5.6, పులిచెర్లలో 2.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

ఉధృతంగా ప్రవహిస్తున్న గార్గేయ నది

సోమల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గార్గేయనది ఉధృతంగా ప్రవహిస్తోంది. దుర్గంకొండల నుంచి గార్గేయ నది ప్రారంభమై పెద్దఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె పంచాయతీల్లో ప్రవహించి సదుం మండలంలో ప్రవేశిస్తుంది. ఈ నది ప్రవాహ వేగం పుంజుకుని కొర్లకుంట ప్రాజెక్టు నిండుకుని దిగువకు ప్రవహిస్తోంది. ఈ క్రమంలోనే పత్రపల్లె వద్ద గార్గేయనది కలర్వుపై పొంగి ప్రవహించడంతో గ్రామస్తులు పూజలు చేశారు.

ఎంపీటీసీకి కన్నీటి వీడ్కోలు

పాలసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫైనాన్స్ వ్యాపారుల ఆగడాలకు బలైపోయిన పాలసముద్రం మండలం నరసింహాపురం ఎంపీటీసీ జగన్నాథరాజు(50)కు గురువారం స్వగ్రామమైన టీపీఎస్‌ఆర్.పురంలో అంత్యక్రియలను గురువారం నిర్వహించారు.పొక్లయినర్ కంతులు కట్టకపోవడంతో ఏలూరు జిల్లా నూజివీడులోని ఫైనాన్స్ కంపెనీకి చెందిన కొంతమంది సోమవారం జీడీనెల్లూరులో జగన్నాథరాజును కిడ్నాప్ చేసి నూజివీడుకు తరలించిన విషయం తెలిసిందే. మంగళవారం తెల్లవారుజామున మునునూరు మండలం కాట్రేనుపాడు గ్రామ శివారులో బహిర్భూమికంటూ దిగిన జగన్నాథరాజు తప్పించుకోబోతూ అక్కడి పామాయిల్ తోటలో శవమై పడివున్నాడంటూ జగన్నాథరాజు భార్యకు కిడ్నాపర్లు సమాచారం అందించారు.నూజివీడులో బుధవారం జగన్నాథరాజుకు పోస్టుమార్టం పూర్తయ్యాక శవాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చిన కుటుంబసభ్యులు గురువారం అంత్యక్రియలు జరిపించారు.టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబునాయుడు, జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, జిల్లా టీడీపీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ గౌరవ సూచికంగా జగన్నాథరాజు భౌతికకాయంపై టీడీపీ జెండాను కప్పి నివాళులర్పించారు. పార్టీ తరపున మృతుడి భార్య రాధకు రూ.5,000 అందజేసి పార్టీ అండగా ఉండి కుంటుబాన్ని ఆదుకుంటుందని అనునయించారు. టీడీపీ నాయకులు హరిబాబు, రమేష్, వెంకటేష్‌యాదవ్, శేఖర్‌రాజు, సాంబశివన్, అరుళ్‌నాథన్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ కూడా జగన్నాథరాజుకు నివాళులర్పించారు. అంతిమ యాత్రలో భారీ ఎత్తున టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శిస్తే సహించం

- మాజీ ఎంపీ నెలవల

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త, అజాత శత్రువు అయిన కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించినా, శవరాజకీయాలు చేసినా ఎట్టి పరిస్థితుల్లో సహించమని మాజీ ఎంపీ, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం తీవ్రంగా హెచ్చరించారు. ఎటువంటి వివాదాలు లేని గంగాప్రసాద్‌ను ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి విమర్శించడం అర్థరహితమని, ఆయనస్థాయికి తగినది కాదని అన్నారు. పెళ్లకూరు మండలం చిల్లకూరులో చెంచయ్య మృతి చెందితే ఎటువంటి ఆధారాలు లేకుండా టీడీపీకి ఆపాదించడం వంటి శవరాజకీయాలు మానుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీరెడ్డి, రమేష్ నాయుడులు సత్యనారాయణరెడ్డి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. టీడీపీ మండల కార్యదర్శి నాగేంద్రరెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణయ్య, విజయమోహన్ నాయుడు, నాయకులు సుబ్బారావు, నారాయణ, చెంగయ్య పాల్గొన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం హేయమైన చర్య

గంగాప్రసాద్‌ను విమర్శించే స్థాయి నీకు లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డిని తిరుపతి జిల్లా టీడీపీ కార్యదర్శి గణపర్తి శోభన్‌నాయుడు హెచ్చరించారు. ఎంతోమందికి ఉపాధి కల్పించిన ఆయనను విమర్శించడం హేయమైన చర్య అని అన్నారు.

గంగాప్రసాద్‌ను విమర్శించడం తగదు: ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కొండేపాటి గంగాప్రసాద్‌ను విమర్శించే అర్హత డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికి లేదని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. గురువారం ఆమె గంగాప్రసాద్ ఇంటి వద్ద మీడియాతో మాట్లాడుతూ వైసీపీ కార్యకర్త అనుమానాస్పదస్థితిలో చనిపోతే దానిని టీడీపీకి రుద్దడం సరికాదన్నారు. కొండేపాటిపై చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి టి.సుధాకర్ రెడ్డి, నాయకులు నెలవల రాజేష్, ఆకుతోట రమేష్, కె.శంకరయ్య, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

తపాల ఉద్యోగులపై వేధింపులను ఆపాలి

గూడూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ తపాల ఉద్యోగులపై లక్ష్యాల పేరుతో చేస్తున్న వేధింపులను ఆపాలని ఎన్‌ఎఫ్‌పీఈ యూనియన్ నాయకుడు రాజు అన్నారు. గురువారం స్థానిక పోస్టాఫీసులో ఎన్‌ఎఫ్‌పీఈ ఆధ్వర్యంలో తపాల ఉద్యోగులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యాల వేధింపులను నియంత్రించకపోతే నవంబరు 12, 13 తేదీలలో ఢిల్లీలోని డాక్ భవన్ ఎదుట రిలేనిరాహార దీక్షలు చేపడుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సుధాకర్‌రాజు, నజీముద్దీన్, ఫైరోజ్, చంద్రశేఖర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో వర్షానికి దెబ్బతిన్న ఎల్డిపైర్ల రైతులకు సూళ్లూరుపేట రైతు సేవా సహకార సంఘంలో సబ్సిడీపై విత్తనాలను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం పంపిణీ చేశారు. వారం రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి కొరిడి, పేర్నాడు, దామరాయి పంచాయతీల్లో సుమారు 150 ఎకరాలకు పైగా ఎల్డిపైర్లు నీటిలో కుళ్లిపోయి రైతులకు నష్టం జరిగింది. దీంతో వ్యవసాయాధికారులు నష్టాన్ని అంచనా వేసి పంపించడంతో, నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడీతో రూ.1215 విలువ గల 30 కిలోల బస్తాను రూ.243కే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏ.రమేష్, ఏజీ.కిషోర్, తిరుపాల్, కె.శంకరయ్య, ఏడీఏ అనిత, ఏవో కవిత తదితరులు పాల్గొన్నారు. వైసీపీ అధికారంలో లేకపోయినా ఇంకా ఆ పార్టీ నాయకుల కనుసన్నలోనే ఏవో కవిత పనిచేస్తున్నారని టీడీపీ నాయకులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో మొరపెట్టుకొన్నారు. వెంటనే ఎమ్మెల్యే కలుగజేసుకొని ఇకనైనా ప్రజల కోసం పనిచేయాలని ఏవోకు హితవు పలికారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


శ్రీనివాసరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

వాకాడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముట్టెంబాక ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న టి.శ్రీనివాసరావు ఇటీవల మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన సందర్భంగా గురువారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆ పాఠశాలలో ఉపాధ్యాయుల నడుమ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీనివాసరావు ఎంతో కష్టపడితేనే ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిందన్నారు. శ్రీనివాసరావును సన్మానించిన వారిలో ఉచ్చూరు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఉచ్చూరు మల్లికార్జున్‌రెడ్డి, సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి, దువ్వూరు మధుసూదన్‌రెడ్డి, కుంచం దయాకర్, తిరుమూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు ఉన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తాం

డక్కిలి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులందరికీ న్యాయం చేస్తామని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రా మీనా అన్నారు. గురువారం ఆయన మండలంలోని ఆల్తూరుపాడు, దేవునివెల్లంపల్లి, వెంబులూరు, మాధవాయపాళెం గ్రామాల్లో రైల్వే లైన్ నిర్మాణం జరిగే భూములకు నష్టపరిహారం అందించేందుకు గాను గ్రామ సభలు నిర్వహించారు. రైతులకు చెందిన 105 ఎకరాల భూములకు సంబంధించిన రికార్డులను స్థానిక రెవిన్యూశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. డక్కిలి తహసిల్దార్ శ్రీనివాసులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చెంచయ్య మృతికి టీడీపీ వారే కారణం

- మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య

నాయుడుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త బల్లి చెంచయ్య మృతికి టీడీపీ వారే కారణమని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. నాయుడుపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెళ్లకూరు మండలం చిల్లకూరుకు చెందిన వైసీపీ కార్యకర్త చెంచయ్య బుధవారం మృతి చెందినా, గురువారం మధ్యాహ్నం వరకు పోస్టుమార్టం చేయకపోవడంపై పలు అనుమానాలను వ్యక్తం చేశారు. పోలీసులు ఎటువంటి వివక్ష లేకుండా కేసు దర్యాప్తు చేయాలని అన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ చెంచయ్య మృతి చెందిన విషయం జగన్మోహన్‌రెడ్డికి తెలియజేశామని, పార్టీ నుంచి రూ.లక్ష అందజేయనున్నట్లు చెప్పారు. వైసీపీ నాయకులు చదలవాడ కుమార్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షంలోనూ వైసీపీ విఫలం

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డి స్పష్టం

సూళ్లూరుపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో కోల్పోయాక ప్రతిపక్షంలోనూ పూర్తిగా విఫలమైందని, ప్రభుత్వంపై పోరాడే శక్తి కాంగ్రెస్‌కు మాత్రమే ఉందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈద సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన ఆర్‌అండ్‌బి బంగ్లాలో మీడియాతో మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్‌కు ప్రజా సమస్యలు, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై మాట్లాడే ధైర్యం లేదని, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ప్రధాన ప్రతిపక్షం పాత్ర పోషిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని చెప్పారు. డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు, నాయకులు వెంకటయ్య, బి.రాజారెడ్డి, రవి, చిన్నయ్య పాల్గొన్నారు.

సీసీల సస్పెన్షన్‌ను రద్దుచేయాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం వెలుగు కార్యాలయంలో పనిచేసే సీసీల సస్పెన్షన్‌ను రద్దుచేయాలని షెడ్యూల కులాల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిశెట్టి ధర్మయ్య అన్నారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీ షెడ్యూలకులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో పాటు న్యాయమూర్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో నిర్మాత దిల్ రాజు



శ్రీకాళహస్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం ప్రముఖ సినీ నిర్మాత దిల్ రాజు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకులు

శ్రీకాళహస్తి,అక్టోబరు 24: పట్టణం లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం మహిళా సాధికారత విభాగం సమన్వయకర్త శైలజ, తెలుగు శాఖాధ్యక్షులు ఆధ్వర్యంలో మహిళలు, పిల్లల సంరక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది ప్రజ్ఞశ్రీ చట్టాలు, రోడ్డు భద్రతా నియమాలు, శిక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్య క్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, శివశంకర్‌నాయక్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక సభ్యత్వ నమోదు చేయించిన నేతలకు అభినందన



సమావేశంలో మాట్లాడుతున్న కోలా ఆనంద్

శ్రీకాళహస్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాలను అత్యధికంగా చేయించిన నాయకులు, కార్యకర్తలను గురువారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప ఘనంగా సన్మానించారు. సుమారు 45వేలు సభ్యత్వాలు అయ్యాయని 50 వేలకు చేరేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు కోలా ఆనంద్ తెలిపారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ వినాయక పూజలు చేశారు. అనంతరం స్వామివారికి అభిషేకం చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి దివాకర్ తెలిపారు. మండలంలోని తహనగర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దోమలు రాకుండా పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ కార్యకర్తకు ఘననివాళి



నివాళులు అర్పిస్తున్న గంజి మాధవయ్య

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్తకు రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య నివాళులర్పించారు. పుత్తూరు రూరల్ మండలం తిరుమలకుప్పం గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమల కుప్పం ఏఏడబ్ల్యూకు చెందిన టీడీపీ కార్యకర్త గోవిందయ్య అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన మృతదేహానికి గంజి మాధవయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. పుత్తూరు రూరల్ టీడీపీ ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు ఈశ్వర్, గిరి, భాస్కరయ్య పాల్గొన్నారు.

28న నారాయణవనం మండల సమావేశం

నారాయణవనం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయం నందు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి ఒక ప్రకటనతో తెలిపారు.

పేద విద్యార్థులకు విద్యా సామగ్రి వితరణ



పుత్తూరు టౌన్, అక్టోబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక గేటు పుత్తూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్ (తమిళం)లోని పేద విద్యార్థులకు, నోటు పుస్తకాలను టీడీపీ నాయకులు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనపాల్, వాణిజ్య ఉపాధ్యక్షులు గణేష్, నాయకులు కరుణాకరన్, కౌన్సిలర్ కేశావాచారి, సుజాత, హెచ్‌ఎం కృష్ణవేణి, పాఠశాల ఛైర్మన్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు గొల్లపల్లి విద్యార్థులు



పుత్తూరు టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులు ఏడుగురు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు భారతి తెలిపారు. పూతలపట్టులో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్ 14 హ్యాండ్ బాల్ పోటీలలో 9 వ తరగతి చదువుతున్న ఏ.అమృత, ఏకాంబర కుప్పంలో జరిగిన నెట్ బాల్ పోటీలలో బాలుర విభాగంలో లక్ష్మీనారాయణ, రేవంత్, లవకుమార్, యశ్వంత్, పవిత్ర, జానీ ఎంపికైనారని తెలిపారు. నవంబరు 9, 10, 11 వ తేదీలలో విశాఖపట్నంలో జరగు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీ గోపికృష్ణ, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లా బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

పుత్తూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి అండర్-14 బాలబాలికల కబడ్డీ జిల్లా జట్లను గురువారం ఎంపిక చేశారు. గురువారం పుత్తూరు ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలు జరిగాయి. ఎంపికైన జట్ల క్రీడాకారులు నవంబరు 9 నుంచి బాపట్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు. ఈ సందర్భంగా పుత్తూరు డీవైఈవో ప్రభాకర్ రాజు, అన్ని మండలాల పీఈటీలు, తిరుపతి జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సదా శివయ్య, ఎంఈఓలు తిరుమలరాజు, బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నారాయణవనం విద్యార్థి

నారాయణవనం, అక్టోబర్ 24(ఆంధ్రజ్యోతి): నారాయణవనం మండలం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న అజయ్ కబడ్డీ అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అజయ్‌ను పీడీ సదాశివన్, ఉపాధ్యాయులు, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బాబు, మరో పీడీ జయప్రకాష్ అభినందించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పోలీసుల విధులపై అవగాహన

వరదయ్యపాళెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ పారిశ్రామికవాడలోని పోలీస్‌స్టేషన్‌లో ఇరుగుళం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పోలీసు విధులపై, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరిప్రసాద్ పాల్గొన్నారు.

వీడియో జర్నలిస్టుకు గాయాలు

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో ఓ వీడియో జర్నలిస్టుకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సాయంత్రం రేణిగుంట -కడప రోడ్డు మార్గంలో అమర ఆస్పత్రి వద్ద చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ..రేణిగుంట మండలం రామకృష్ణాపురానికి చెందిన వీడియో జర్నలిస్టు మధురాయల్ విధుల్లో భాగంగా ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లి పోయింది. తలకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు వెంటనే రుయాకు తరలించారు.

రోడ్డుకు టీడీపీ నేతల మరమ్మతులు



సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోలీస్ క్వార్టర్స్‌కు వెళ్లే దారిలో గుంతలు తేలిన రోడ్డుకు టీడీపీ నాయకులు మరమ్మతులు చేపట్టారు. స్థానిక ఊత్తుకోట్టై రోడ్డులో బాలుర గురుకుల పాఠశాల నుంచి పార్కు వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు చెరువులా మారి వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన మండల టీడీపీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ రామస్వామి చొరవతో గుంతలను కంకర, డస్ట్‌ను తోలి పూడ్చి, రోడ్డును చదును చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ చంద్రశేఖర్ నాయుడు నాయకులు పరమశివం, చిన్న, కృష్ణ, సురేంద్రరెడ్డి, శశి, షణ్ముగం, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గంగ కాలువలో మృతదేహం లభ్యం

సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు గంగ కాలువలో తేలుతున్న ఒక మృత దేహాన్ని పోలీసులు వెలికితీశారు. గురువారం మధ్యాహ్నం మదనంబేడు సమీపంలో తెలుగుగంగ కాలువలో ప్రవాహానికి కొట్టుకు వస్తున్న ఒక మృత దేహాన్ని రైతులు గమనించి సత్యవేడు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ రామస్వామి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని వెలికి తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు మండలంలోని బాలకృష్ణాపురానికి చెందిన చెంగయ్యనాయుడిగా (61) గుర్తించారు. కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టీడీపీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయండి

వరదయ్యపాళెం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో విజయవంతం చేయాలని పార్లమెంటు అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.నాగరాజు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ నవంబరు 26న సభ్యత్వ నమోదును ప్రారంభించనున్నట్లు తెలిపారు.

రూ.50లక్షల పరిహారం ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న వైసీపీ, వామపక్ష నేతలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ఢీకొని ఐదేళ్ల కొడుకుతో సహా తండ్రి మృతి చెందడంతో ఆ కుటుంబానికి ప్రభుత్వం రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వైసీపీ, వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాత్రి దొమ్మరపాళెం వద్ద ద్విచక్ర వాహనాన్ని ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి మార్చురీ వద్ద గురువారం పలువురు నాయకులు మృతుల కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆస్పత్రి ఎదుట నిరసన ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముక్కంటి ఆలయ మాజీ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు మాట్లాడుతూ రాత్రి వేళల్లో ఇష్టానుసారం ఇసుక ట్రాక్టర్లను నడపడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యవర్గ కార్యదర్శి అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ కుటుంబ పెద్దతో పాటు ఐదేళ్ల కుమారుడు చనిపోవడం అమానుషమన్నారు. ముగ్గురు పిల్లలతో సహా మృతుని భార్య రోడ్డున పడిందన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య మాట్లాడుతూ రాత్రివేళల్లో బెంగళూరు, చెన్నై నగరాలకు ఇసుక తరలించి అక్రమార్కులు కోట్లుగడిస్తున్నారని ఆరోపించారు.

ముగిసిన అంత్యక్రియలు



అంబులెన్సులో తరలుతున్న మృతదేహాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన రాజేంద్రన్, అతని కుమారుడు చైతన్య(5) మృతదేహాలను పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. తొట్టంబేడు మండలం చియ్యవరంలో అంత్యక్రియలు నిర్వహించారు. తండ్రీబిడ్డల అంత్యక్రియలు చూసి బంధు వులు కన్నీటిపర్యంత మయ్యారు.

గడువు తీరకనే హోటల్ ఖాళీ చేయాలని దౌర్జన్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాత్రికి రాత్రే హోటల్ ఖాళీ చేయాలంటూ దౌర్జన్యానికి పాల్పడిన ఘటన బుధవారం రాత్రి శ్రీకాళహస్తిలోని కుమారస్వామి తిప్ప వద్ద జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి ఆలయ స్వాగత ఆర్చికి సమీపంలో ఉన్న ఓ రూమ్‌లో ఆరేళ్లుగా శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామానికి చెందిన వ్యక్తి హోటల్ నిర్వహిస్తున్నాడు. అయితే హోటల్ స్థానంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు యజమాని గుట్టుచప్పుడు కాకుండా ఒప్పందం చేసుకున్నాడు. ఆ మేరకు అతడిని వెంటనే ఖాళీచేయాలని ఒత్తిడి చేశాడు. నెలకు రూ.55వేలు అద్దెను క్రమం తప్పకుండా చెల్లించడమే కాకుండా రూ.10లక్షలు హోటల్ సామగ్రికోసం వెచ్చించానని ఇప్పుడు ఖాళీ చేయించడం తగదని వాపోయాడు. దీనిపై వాగ్వాదం చోటు చేసుకుంది. మద్యం దుకాణం కోసం హోటల్‌ను ఖాళీ చేయించడం ఎంత వరకు సమంజసమని స్థానికులు కొందరు అడ్డుకోవడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమణిగినట్లు సమాచారం.

భూసేకరణకు సహకరించండి : జేసీ



డీఆర్‌డీవోకు తీసుకున్న భూములను పరిశీలిస్తున్న జేసీ శుభం బన్సల్

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డీఆర్‌డీవో కోసం కేటాయించిన భూములకు సంబంధించి రైతులు భూసేకరణకు సహకరించాలని జేసీ శుభం బన్సల్ కోరారు. 2013 ఫిబ్రవరిలో పల్లం రెవెన్యూలో 470, 480, 483 తదితర సర్వే నెంబర్లలో 11మంది రైతుల నుంచి 50 ఎకరాలను సేకరించారు. రూ.20 లక్షల పరిహారానికి ఏడుగురు అంగీకరించారు. సరిపోదని ఇంకా ఎక్కువ ఇవ్వాలని నలుగురు రైతులు హైకోర్టును ఆశ్రయిం చినట్లు తెలియజేశారు. ఈ క్రమంలో ఆ భూములను జేసీ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. భూసేకరణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు భార్గవి, ఆర్ఐ రవితేజ పాల్గొన్నారు.

'బాణసంచా దుకాణాలను ధ్వంసం చేయడానికి వెనుకాడం'



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘ నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వాస్పత్రి మార్గంలో బాలుర జూనియర్ కళాశాలలో బాణాసంచా దుకాణాలు ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయడానికి వెనుకాడబోమని ఏఐఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్ఐ నాయకులు హెచ్చరించారు. గురువారం వారు జూనియర్ కళాశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలు, అన్న క్యాంటీన్ ఉన్నాయని వివరించారు. సమీపంలోనే ఆర్టీసీ బస్టాండు కూడా ఉందన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పెద్దమొత్తంలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. తాము ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో అనుమతులు ఇవ్వాలని వినతులు ఇచ్చినా అధికారులు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో కోగిలి మునిచంద్ర, జాకీర్, విష్ణుకాంత్, అబ్దుల్‌కలాం, మునిగోవిందు, గురవయ్య, రిజ్వాన్, సల్మాన్ పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు ఏర్పాట్లు

శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి రోడ్డులోని బాలుర జూనియర్ కళాశాల ప్రాంగణంలో బాణసంచా దుకాణాలకు ఏర్పాట్లు ప్రారంభించారు. అధికారులు 13 దుకాణాలకు అనుమతులు మంజూరు చేశారు.

'నా పేరు చెబితే వదిలేయ్'

- గేటు వసూలు చేయకు
- టీడీపీ నాయకుడి హుకుం

రేణిగుంట, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): 'నా పేరు చెబితే గేటు వసూలు చేయొద్దు ఆ వాహనాలను వదిలెయ్' అని పట్టణానికి చెందిన ఓ టీడీపీ నాయకుడు పంచాయతీ సిబ్బందిని హెచ్చరిస్తున్నారు. ఈ విషయం పట్టణంలో చర్చనీయాంశమైంది. రేణిగుంట మేజర్ పంచాయతీకి ప్రధానంగా ఆదాయం సమకూర్చే పార్కింగ్, దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, పంచాతీ దుకాణాలకు ఐదు నెలలుగా టెండర్లు పిలవలేదు. పంచాయతీ ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది. ప్రస్తుతం పంచాయతీ సిబ్బంది గేటు వసూళ్లు చేసినా పెద్ద మొత్తంలో వసూలు కావడం లేదు. ఈ క్రమంలో స్థానిక టీడీపీ నాయకుడు పట్టణంలోని వైసీపీ నాయకుడికి చెందిన చికెన్, వాటర్ బాటిల్ వాహనాలకు గేటు వసూలు చేయరాదని, ఎవరైనా తన పేరు చెబితే వదిలేయాలని హెచ్చరిస్తుండడం గమనార్హం.

ఆర్థిక అక్షరాస్యత ముఖ్యం

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో గురువారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీసీసీ బ్యాంకు నోడల్ అధికారి సురేష్‌బాబునాయుడు, ఏర్పేడు బ్యాంకు మేనేజరు తేజస్వి మాట్లాడుతూ బడ్జెట్, పొదుపు, స్మార్ట్ ఫైనాన్షియల్ ప్లానింగ్ ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. 11 గ్రామాల నుంచి 140మంది మహిళలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల నివారణకు రసాయనిక మందు పిచికారి

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎండీపుత్తూరు గ్రామంలో పిచ్చిమొక్కల నివారణకు రసాయనిక మందును గురువారం పంచాయతీ సిబ్బంది పిచికారి చేశారు. దళితవాడ వరకు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఈ కార్యక్రమం చేపట్టారు.

ఉచితనేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన

ఏర్పేడు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలం ఎండీపుత్తూరు గ్రామంలో అమెరికన్ లేజర్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు వందమంది గ్రామస్తులు కంటిపరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది డీపీవో కేశవులు, రాజేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానం, దుప్పట్ల పంపిణీ



రేణిగుంట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రష్ ఆస్పత్రి అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం తన సతీమణి డాక్టర్ సిపాయి శాంతి వర్ధంతి సందర్భంగా రేణిగుంట సమీపంలోని ఆమె సమాధి వద్ద గురువారం ఆయన కుటుంబసభ్యులు నివాళులు అర్పించారు. అనంతరం అభయ క్షేత్రంలో 200 మంది దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. డాక్టర్ సిపాయి కీర్తిసాగర్‌రెడ్డి, డాక్టర్ సిపాయి మౌనిరెడ్డి, పెరుమాళ్‌రెడ్డి, డాక్టర్ బాబు, రోజా, దీప తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మొక్కల పంపిణీ

సత్యవేడు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు శ్రీసిటీ ఫౌండేషన్ వివిధ రకాల మొక్కలను పంపిణీ చేసింది. ఈ నేపథ్యంలో గురువారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం భారతి ఆధ్వర్యంలో విద్యార్థులు మొక్కలు నాటారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన కారు

ముగ్గురికి స్వల్పగాయాలు



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలం లోని శ్రీకాళహస్తి - తడ రోడ్డు అరిగిలకండ్రిగ మలుపు దగ్గర కారు అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో కారులో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యేక్ష సాక్షుల కథనం మేరకు.. తమిళనాడు ఆరంబాకం నుంచి గురువారం ముగ్గురు కారులో తిరుపతికి బయలుదేరారు. మండలంలోని అరిగిలకండ్రిగ గ్రామం మలుపులో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న పొలంలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొని పొలంలోకి దూసు కెళ్లింది. కారులోని ముగ్గురికీ స్వల్పగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక ఆధార్ శిబిరానికి జనం తాకిడి



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక ఆధార్ శిబిరానికి జనం తరలివచ్చారు. ఇక్కడ చాలా రోజుల నుంచి ఆధార్ కేంద్రం మూతపడటంతో ఆధార్ కోసం ప్రజలు శ్రీకాహస్తి ఇతర కేంద్రాలకు వెళ్లలేక ఇబ్బందులు పడేవారు. ఈ క్రమంలో ఎంపీడీవో ఆదేశాలతో ప్రత్యేక ఆధార్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో పెద్దసంఖ్యలో జనం ఆధార్ కోసం వచ్చారు. కార్యదర్శి సుబ్రమణ్యం ఆధార్‌లో మార్పులు, చేర్పులు చేయించారు.

ఉద్దిపంట దున్నివేత

కేవీబీపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకున్న వారిని వదిలేసి అతడి భూమిని కొనుగోలు చేసిన వారి పంటను దున్నేశారు కొంతమంది ఘనులు. ఈ ఘటన మండలంలోని సిద్ధమనాయుడు కండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. పిచ్చాటూరు మండలం పులిగుండ్రం గ్రామానికి చెందిన కృష్ణవేణమ్మకు సిద్ధమనాయుడు కండ్రిగలో సర్వే నెంబరు 86, 87, 113లో 5.96ఎకరాల పొలం ఉంది. ఈ పొలాన్ని అదే గ్రామానికి చెందిన సతీష్ నుంచి 2023లో కొనుగోలు చేసింది. అప్పటినుంచి ఈమె అనుభవంలోనే ఉంది. ప్రస్తుతం ఉద్దిపంట (మినుము) పంట సాగు చేసింది. పంట ఏపుగా పెరుగుతోంది. ఇంతలో అదే గ్రామానికి చెందిన కృష్ణయ్య, అతని కుమారుడు సోమశేఖర్, కుమార్తె రేఖలు ట్రాక్టర్‌తో ఆ పంటను దున్నివేశారు. కృష్ణవేణమ్మ ప్రశ్నించగా 'మీకు పొలం విక్రయించిన సతీష్ మాకు డబ్బు ఇవ్వాలి. అందుకే దున్నేశాం' అని బుదులిచ్చారు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.





దున్నేయక ముందు.. ఇలా దున్నేశాక ఇలా..